
RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 | ISSUE: 227 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 13-3-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక :227 | విశాఖపట్నం 13-3-2026 | పేజీలు : 8 | రూ: 2/-

# పన్ను ఎగవేతదారులు తప్పించుకోవడానికి వీల్లేదు

- పన్ను ఎగవేతలను అరికట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ఇతర రాష్ట్రాల్లో ఉంటూ ఏపీలో పనిచేసే కాంట్రాక్టర్లపై ప్రత్యేక దృష్టి
- పన్ను ఎగవేతదారులను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం
- ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం నుంచి అందే లబ్ధిని వివరిస్తూ సంక్షేమ లేఖ ఇవ్వాలని ఆదేశం
- పథకాల అమలులో పూర్తి పారదర్శకత తీసుకురావడమే లక్ష్యమని వెల్లడి



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాష్ట్రంలో పన్ను ఎగవేతలను నిరోధించేందుకు పటిష్ఠమైన కార్యాచరణ చేపట్టాలని, ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో కొనసాగుతున్న ఆరో జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భాగంగా ఆయన ఆదాయార్జన శాఖలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పన్ను ఎగవేతలపై కఠినంగా వ్యవహరించాలని, అయితే పన్ను చెల్లింపుదారులను అనవసరంగా వేధించవద్దని స్పష్టం చేశారు. కొందరు కాంట్రాక్టర్లు తమ కార్యాలయాలను పొరుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకొని, ఆంధ్రప్రదేశ్‌లో పనులు చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. జాతీయ రహదారులు, రైల్వేలు, ఇతర ప్రాజెక్టుల పనులు చేస్తున్నప్పటికీ, వారి నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నులు రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. టెండర్లు, వర్క్ ఆర్డర్లలో ఉన్న కాంట్రాక్టర్ల నుంచి ఆదాయం రాబట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టుల కాంట్రాక్టర్లు చెల్లించే పన్నులు మన రాష్ట్ర ఖజానాకే చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గట్టిగా చెప్పారు. "పారిశ్రామిక, సేవా

తరువాయి 2లో..

# రూ.22 వేల పెట్టుబడితో రూ.3.5 లక్షల ఆదాయం


మోదీ ఏఐ వీడియోపై స్పందించిన కేంద్రం

ఈ వీడియో నకిలీదని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం వెల్లడి

ఆ వీడియోల కింద ఇచ్చిన లింక్స్‌పై క్లిక్ చేయవద్దని సూచన

మోదీ మాట్లాడుతున్నట్లుగా ఉన్నది

ఏఐ జనరేటెడ్ వీడియో అని వెల్లడి




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

రూ.22 వేల పెట్టుబడితో నెలకు రూ.3.5 లక్షల ఆదాయం పొందేలా ఒక పెట్టుబడి పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రమోట్ చేస్తున్నట్లుగా ప్రసారమవుతున్న వీడియోలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ వీడియో నకిలీదని పీఐబీ

తరువాయి 2లో..

# టారిఫ్‌ల కోసం ట్రంప్ '301' ఆయుధం.. భారత్ సహా 16 దేశాలపై దర్యాప్తు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎడాపెడా విధించిన సుంకాలు చెల్లవంటూ అగ్రరాజ్య సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. దీంతో ఇతర దేశాల నుంచి ఎలాగైనా టారిఫ్‌లు వసూలుచేయాలని కంకణం కట్టుకున్న ట్రంప్.. ఇందుకోసం కొత్తదారులు వెతుకుతున్నారు. తాజాగా 'సెక్షన్ 301' ఆయుధాన్ని బయటకు తీశారు. దీనికింద భారత్, చైనా సహా 16 వాణిజ్య భాగస్వామ్య దేశాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు అమెరికా వాణిజ్య శాఖ ప్రతినిధి జెమిసన్ గ్రీర్ కీలక ప్రకటన చేశారు. 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద.. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్, సింగపూర్, స్విట్జర్లాండ్, నార్వే, ఇండోనేసియా, మలేసియా, కంబోడియా, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా, వియత్నాం, తైవాన్, బంగ్లాదేశ్, మెక్సికో, జపాన్ దేశాలపై ఈ దర్యాప్తు జరగనుందని గ్రీర్

తరువాయి 2లో..

## నగరాల్లో 25 రోజులు, గ్రామాల్లో 45 రోజులు...

# గ్యాస్ బుకింగ్ వ్యవధిపై కేంద్రం కీలక నిర్ణయం

ఇరాన్ యుద్ధంతో తీవ్రమైన వంటగ్యాస్ కొరత

గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు పెరిగిన బుకింగ్ గ్యాప్

రెండు సిలిండర్ల మధ్య వ్యవధిని పెంచిన కేంద్ర ప్రభుత్వం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**



దేశంలో నెలకొన్న వంటగ్యాస్ (ఎల్పీజీ) కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో గృహ వినియోగదారులకు ఎల్పీజీ సిలిండర్ రీఫిల్ బుకింగ్ మధ్య వ్యవధిని 45 రోజులకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ, నగర ప్రాంతాల్లో

తరువాయి 2లో..

# గ్యాస్ కొరతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

ఎల్పీజీ సిలిండర్ల కొరతపై కేంద్రానికి కేటీఆర్ లేఖ



**హైదరాబాద్, సిటిజన్ టైమ్స్**

దేశంలో వాణిజ్య, గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల తీవ్ర కొరత ఏర్పడిందని, ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు

తరువాయి 2లో..



# భారత్ పతాక నౌకలు.. హార్మూజ్ నుంచి వెళ్లొచ్చు

# ఇరాన్ అనుమతి

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రపంచ ఇంధన సంక్షోభం వేళ భారత్‌కు భారీ ఊరట లభించినట్లు తెలుస్తోంది. భారత్ జెండాతో ఉన్న నౌకలు హార్మూజ్ జలసంధి (హ్‌త్రీుఖ్ హాట ఎశీతీఎబఓ) మీదుగా ప్రయాణించేందుకు ఇరాన్ అనుమతించినట్లు సమాచారం. విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య జరిగిన చర్చల ఫలితంగా ఈ ఉపశమనం లభించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో పుష్పక్, పరిమళ్ పేరిట ఉన్న రెండు ఇండియన్ ట్యాంకర్లు హార్మూజ్ జలసంధిని దాటినట్లు పేర్కొన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాలకు చెందిన నౌకలు ఆంక్షలు ఎదుర్కొంటున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి జైశంకర్-అరాగ్చీల మధ్య మూడుసార్లు చర్చలు జరిగాయి. మంగళవారం ఇద్దరి మధ్య జరిగిన ఫోన్‌కాల్ వాటిల్లో ఒకటి. హార్మూజ్ నుంచి ట్యాంకర్లు సురక్షితంగా గమ్యస్థానానికి చేరడంపై వారు ప్రధానంగా మాట్లాడుకున్నారు. ఇక, జైశంకర్ బుధవారం రష్యా, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రులు, ఐరోపా నేతలతోనూ మాట్లాడారు. వీరు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ప్రస్తుత సంక్షోభ ప్రభావాన్ని చర్చించుకున్నారు.

**ముంబయి పోర్ట్‌కు చమురు నౌక..**

లైబీరియా జెండాతో ఉన్న చమురు నౌక ముంబయి పోర్ట్‌కు

తరువాయి 2లో..

# దేశంలోనే తొలి అటానమస్ షిప్ యార్డ్... జువ్వలదిన్నెలో శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

- నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో అటానమస్ షిప్ యార్డ్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన
- సాగర్ డిఫెన్స్ సంస్థ తొలి దశలో రూ.45 కోట్ల పెట్టుబడి
- వెయ్యి మందికి పైగా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు
- ఏపీని మారిటైం రోబోటిక్స్ హబ్‌గా మార్చడమే లక్ష్యం
- 2026 నవంబర్ నాటికి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభం

**నెల్లూరు, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, రక్షణ రంగాల్లో మరో కీలక ముందడుగు పడింది. దేశ సముద్ర సాంకేతిక సామర్థ్యాలను గణనీయంగా పెంచే దిశగా నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద దేశంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల

తరువాయి 2లో..



## ఇది ప్రారంభం మాత్రమే...

# గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది

దేశానికి ఇంధన సంక్షోభం ముంచుకొస్తోందని రాహుల్ గాంధీ హెచ్చరిక

గ్యాస్, పెట్రోల్, ఎల్పీజీ సరఫరాలో తీవ్ర సమస్యలు తప్పవని ఆందోళన

ప్రభుత్వ తప్పుడు విదేశాంగ విధానాలే ఈ పరిస్థితికి కారణమని విమర్శ



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, దేశ ఇంధన భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తప్పుడు విదేశాంగ విధానాల కారణంగా దేశం త్వరలో గ్యాస్, పెట్రోల్ వంటి ఇంధనాల విషయంలో తీవ్ర సవాళ్లు ఎదుర్కోబోతోందని హెచ్చరించారు. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది... ఇది ప్రారంభం మాత్రమే అని అన్నారు. ప్రజల ప్రయోజనాలను

తరువాయి 2లో..

# లోక్‌సభ స్పీకర్‌కు ఊరట.. వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం తిరస్కరణ

మూజువాణి ఓటుతో వీగిపోయిన ప్రతిపక్షాల తీర్మానం

చర్చలో రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర విమర్శలు

చైర్‌లో కూర్చోకుండా కొత్త సంప్రదాయానికి తెరతీసిన ఓం బిర్లా

స్పీకర్‌ను ఇరుకున పెట్టాలనుకున్న విపక్షాల వ్యూహం విఫలం



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సుమారు 13 గంటల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ అనంతరం, తీవ్ర గందరగోళం మధ్య తాత్కాలిక స్పీకర్

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# పవన్‌కు ప్రమోషన్..

## పెద్ద భారమే మోపుతున్న బీజేపీ!

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై బీజేపీ అధిష్టానం పెద్ద భారం మోపనుందనే ప్రచారం ఆసక్తి రేపుతోంది. ప్రస్తుతం ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేనాని పవన్ రాజకీయంగా తీవ్ర ప్రభావం చూపుతున్నారని బీజేపీ పెద్దలు భావిస్తున్నారని అంటున్నారు. జనసేనాని సినీ గ్లామర్ తోపాటు రాజకీయంగా ఆయన చూపుతున్న దూకుడును వాడుకోవాలని ఓ నిర్ణయానికి వచ్చిన బీజేపీ అగ్ర నాయకత్వం ఎన్డీఏలో పవన్ కు కీలక బాధ్యతలు అప్పగించాలనే ఆలోచనకి వచ్చారని అంటున్నారు. ప్రధానంగా దక్షిణ భారత్ లో ఎన్డీఏ పార్టీల బలోపేతానికి పవన్ ను వాడుకోవాలని బీజేపీ భావిస్తోందని చెబుతున్నారు. రాజకీయంగా పవన్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని భావిస్తున్న బీజేపీ అగ్రనాయకత్వం ఎన్డీఏలో పవన్ కు కీలక పదవి, బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించిందని అంటున్నారు. ఇప్పటివరకు లేని పదవిని పవన్ కోసమే క్రియేట్ చేయాలనే ఆలోచన చేస్తోందని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును జాతీయ రాజకీయాలకు తీసుకువెళతారన్న ప్రచారం జరుగుతున్న ఈ పరిస్థితుల్లో పవన్ ను కూడా దక్షిణ భారత్ స్థాయిలో వాడుకోవాలనే ఆలోచన బీజేపీ పెద్దలు చేస్తుండటం విశేషంగా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం జనసేనాని పవన్ జాతీయస్థాయిలో బీజేపీకి గట్టి మద్ధతుదారుగా ఉన్నారు. 2014లో పార్టీ పెట్టిన నుంచి ప్రధాని మోదీతో సన్నిహిత సంబంధాలు నెరుపుతున్న పవన్.. 12 ఏళ్లుగా బీజేపీతో కలిసే పనిచేస్తున్నారు. అంతేకాకుండా బీజేపీ అజెండాకు దగ్గరగా పవన్ సిద్ధాంతాలు ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. రెండు పార్టీల మధ్య చాలా విషయాల్లో సారూప్యత ఉండటంతో పవన్ ను ప్రోత్సహిస్తూ ఆయనను దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రచారానికి బీజేపీ వాడుకుంటోందని గుర్తుచేస్తున్నారు. గతంలో మహారాష్ట్రలో పవన్ తో ఎన్నికల ప్రచారం చేయించారు. ఆ తర్వాత కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లో సభలు నిర్వహించి పవన్ ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమాలకు పవన్ ఏపీ ఉప ముఖ్యమంత్రిగా, జనసేన అధ్యక్షుడిగా మాత్రమే హాజరయ్యారు. అయితే ఈ పదవులకు మించిన హోదాతో పవన్ ను గౌరవించాలని, ఆయన ప్రతిష్ఠ పెంచాలని బీజేపీ అగ్ర నాయకత్వం భావిస్తోందని చెబుతున్నారు. ఎన్డీఏలో ఉప కన్వీనర్ గా నియమించి, దక్షిణ భారత్ బాధ్యతలు పూర్తిగా పవన్ కు అప్పగించాలనే ప్రతిపాదనను సీరియస్ గా పరిణిస్తున్నారని గట్టిగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం పవన్ విషయంలో సానుకూల దృక్పథంతో ఉన్నారన్న ప్రచారం నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రికి కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే ప్రచారం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. తమిళనాడు ఎన్నికల నేపథ్యంలో పవన్ పదవిపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకునే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. ఇప్పటివరకు పవన్ కు పదవి ఇవ్వకపోయినా దక్షిణ్ భారత్ లో ప్రధాన రాజకీయ వ్యూహాల అమలుకు ఆయనను అస్త్రంగా వాడుకుంటున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. తాజాగా తమిళనాడులో టీవీకే అధిపతి విజయ్ ను ఎన్డీఏ కూటమిలోకి తెచ్చే బాధ్యతను పవన్ కే అప్పగించారని అంటున్నారు. ఈ విషయంలో పవన్ కొంతవరకు సానుకూల ఫలితం కూడా సాధించారని అంటున్నారు. అందుకే విజయ్ ఎన్డీఏలో చేరికను తీవ్రంగా వ్యతిరేకించిన తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నాగేంద్రన్ ఒక్క రోజులోనే తన స్వరం మార్చుకున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. చాప కింద నీరులా పవన్ రాజకీయ వ్యూహాలు అమలు చేస్తుండటం వల్ల బీజేపీ అగ్ర నాయకత్వం ఆయన విషయంలో హ్యాపీగా ఉందని, పవన్ కు ఏ పని అప్పగించినా సమర్ధంగా పూర్తి చేస్తారన్న నమ్మకం పెట్టుకుందని అంటున్నారు.

# దేశంలోనే తొలి అటానమస్ షిప్ యార్డ్...

## జువ్వలదిన్నెలో శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

మంత్రి నారా లోకేశ్ గురువారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ ప్రతిష్మాత్మక ప్రాజెక్టును అభివృద్ధి చేయనుంది. శంకుస్థాపన కార్యక్రమానికి జువ్వలదిన్నె చేరుకున్న మంత్రి లోకేశ్ కు సాగర్ డిఫెన్స్ సంస్థ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించి, ప్రాజెక్ట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం కూటమి ప్రభుత్వం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో 29.58 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఇందులో 7.58 ఎకరాల వాటర్ ఫ్రంట్ ల్యాండ్ కూడా ఉండటం విశేషం. మొదటి దశలో సాగర్ డిఫెన్స్ సంస్థ రూ.45 కోట్ల పెట్టుబడి పెట్టనుండగా, దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి మందికి పైగా యువతకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. షిప్ బిల్డింగ్, అటానమస్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్, మెరైన్ ఇంజనీరింగ్, పరిశోధన-అభివృద్ధి వంటి కీలక రంగాల్లో ఉపాధి లభిస్తుంది. 2026 నవంబర్ నాటికి ఈ కేంద్రంలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టును మొత్తం 200 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో బ్లూ ఎకానమీ, మారిటైం ఆవిష్కరణలు బలోపేతం కావడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌ను మారిటైం రోబోటిక్స్, అటానమస్ షిప్ బిల్డింగ్ హబ్‌గా నిలబెట్టాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అంతకుముందు, జిల్లాకు విచ్చేసిన మంత్రి నారా లోకేశ్ కు బోగోలు మండలం కప్పరాలతిప్ప వద్ద నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంతి రెడ్డి, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, పి.సునీల్ కుమార్, ఎన్.విజయశ్రీ, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు, సాగర్ డిఫెన్స్ సీఈవో కెప్టెన్ నికుంజ్ పరాశర్ తదితరులు పాల్గొన్నారు.

# పన్ను ఎగవేతదారులు తప్పించుకోవడానికి వీల్లేదు

రంగాల్లో వృద్ధి నమోదైతేనే ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం వస్తుంది. ప్రతి రంగంలోనూ వృద్ధి సాధించడం ద్వారా నిర్దేశిత జీఎస్‌డీపీ లక్ష్యాన్ని చేరుకోవాలి" అని చంద్రబాబు అన్నారు. పన్ను ఎగవేతలకు పాల్పడి ఎవరూ తప్పించుకోవడానికి వీల్లేదని, చట్ట ప్రకారం ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించేలా చూడాలని ఆయన దిశానిర్దేశం చేశారు. పన్ను వసూళ్ల విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తూనే, నిజాయితీపరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

**ప్రతి లబ్ధిదారుడికి 'సంక్షేమ లేఖ'**

సూపర్ సిక్స్ సహా ఇతర సంక్షేమ పథకాల అమలులో పూర్తిస్థాయి పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రయోజనాలను వివరిస్తూ 'సంక్షేమ లేఖ' అందజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "ప్రతి నెలా ఏ కుటుంబానికి పెన్షన్, ఉచిత సిలెండర్, తల్లికి వందనం వంటి పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరుతుందో స్పష్టంగా తెలియజేస్తూ లేఖ ఇవ్వాలి. దీనివల్ల ప్రభుత్వ పనితీరులో పారదర్శకతతో పాటు, లబ్ధిదారుల్లో పథకాలపై యాజమాన్య భావన పెరుగుతుంది" అని అన్నారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి త్వరలోనే ఒక క్యాలెండర్‌ను కూడా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. "పెట్టుబడుల గురించి ఎలా ఆలోచిస్తున్నామో, అదే స్థాయిలో పేదల సంక్షేమం, వారి సాధికారత గురించి కూడా కలెక్టర్లు ఆలోచించాలి. సంపద సృష్టితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ధ్యేయం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద మార్చి 9 నాటికి 50.45 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయని, ఇందుకోసం ఆర్టీసీకి ప్రభుత్వం రూ.1,775 కోట్లు రీయింబర్స్ చేసిందని తెలిపారు. సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలని కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఉగాది నాటికి 2.5 లక్షల సామూహిక గృహప్రవేశాలు నిర్వహించాలని, ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన అధికారులకు సూచించారు.

# టారిఫ్‌ల కోసం ట్రంప్ '301' ఆయుధం..

## భారత్ సహా 16 దేశాలపై దర్యాప్తు

వెల్లడించారు. కాగా.. ఈ జాబితాలో కెనడా లేకపోవడం గమనార్హం.

**ఏంటీ సెక్షన్ 301**

ఇతర దేశాలు అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య విధానాలను సవాలు చేసేందుకు అమెరికాకు ఉన్న శక్తిమంతమైన ఆయుధమే ఈ సెక్షన్ 301. తమ వాణిజ్య భాగస్వాములు అనుసరిస్తున్న ట్రేడ్ పాలసీలు .. అమెరికా వ్యాపారాలు, ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయా? అనేదానిపై ఈ చట్టం కింద అమెరికా దర్యాప్తు చేసేందుకు వీలు లభిస్తుంది. ఒకసారి దర్యాప్తు ప్రారంభించిన తర్వాత.. అన్యాయమైన వాణిజ్య విధానాలపై అగ్రరాజ్యం సాక్ష్యాలను సేకరించే పనిలో ఉంటుంది. ఏదైనా దేశం తమకు నష్టం కలిగించేలా ట్రేడ్ పాలసీలను అనుసరిస్తుందని తేలితే.. ప్రపంచ వాణిజ్య సంస్థ అనుమతి లేకుండానే ఆ దేశంపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు ఈ చట్టం కింద అధికారం ఉంటుంది. అలాంటి దేశాలపై చట్టబద్ధంగా భారీ సుంకాలు విధించడం లేదా ప్రతీకార చర్యలు తీసుకునేందుకు అమెరికాకు మార్గం లభిస్తుంది.

**భారత్‌ను ఎందుకు చేర్చారు..?**

చైనా లాంటి ప్రత్యర్థులతో పాటు భారత్ వంటి మిత్రపక్షాల పైనా అమెరికా ఈ దర్యాప్తు చేపట్టడం చర్చకు దారితీసింది. భారత్‌లోని కొన్ని వాణిజ్య విధానాల వల్ల మన మార్కెట్లపై అమెరికాకు పరిమితులు ఉంటున్నాయని చాలాకాలంగా అగ్రరాజ్యం ఆందోళన వ్యక్తంచేస్తోంది. కొన్ని ఉత్పత్తులపై భారత్ అమలుచేస్తోన్న అధిక సుంకాలు, స్థానిక తయారీ, డేటా స్టోరేజీ, టెక్నాలజీ నిబంధనలు వంటివాటిపై అమెరికా అభ్యంతరాలు తెలుపుతోంది. ఈ అంశాల పైనే కొన్నేళ్లుగా ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, తాజా దర్యాప్తుతో భారత్‌పై వెంటనే పెనాల్టీలు పడే అవకాశం లేనప్పటికీ.. భవిష్యత్తులో కొన్ని రంగాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. దీంతో ఆయా రంగాల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### నగరాల్లో 25 రోజులు, గ్రామాల్లో 45 రోజులు...

# గ్యాస్ బుకింగ్ వ్యవధిపై కేంద్రం కీలక నిర్ణయం

మాత్రం 25 రోజుల నిబంధన కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా రెండు సిలిండర్ల బుకింగ్ మధ్య 25 రోజుల గ్యాప్ ఉండగా, ఇకపై ఈ నిబంధన కేవలం పట్టణ, నగర ప్రాంతాలకే పరిమితం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లోని వినియోగదారులు మాత్రం ఒక సిలిండర్ బుక్ చేశాక, తదుపరి సిలిండర్ బుకింగ్ కోసం 45 రోజులు ఆగాల్సి ఉంటుంది. ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఎల్పీజీ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో దేశంలో గ్యాస్ కొరత తీవ్రమైంది. దీంతో చాలామంది వినియోగదారులు ముందుజాగ్రత్తగా సిలిండర్లను బ్లాక్‌లో నిల్వ చేసుకోవడం మొదలుపెట్టారు. ఇదే సమయంలో హైదరాబాద్ సహా పలు నగరాల్లో హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి డిమాండ్ పెరగడంతో కమర్షియల్ సిలిండర్లను ఏజెన్సీలు రెట్టింపు ధరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించి, అందరికీ గ్యాస్ అందుబాటులో ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం పేర్కొంది. గ్యాస్ ఉత్పత్తిని పెంచినప్పటికీ, డిమాండ్‌ను నియంత్రించే చర్యల్లో భాగంగానే ఈ కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చినట్లు తెలుస్తోంది.

# గ్యాస్ కొరతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి ఒక లేఖ రాశారు. ఎల్పీజీ సరఫరాలో అంతరాయం కారణంగా హోటళ్లు, తినుబండారాలు, పీజీ హాస్టళ్లు, చిన్న ఆహార వ్యాపారాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని కేటీఆర్ తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. సరఫరాను వెంటనే పునరుద్ధరించకపోతే, వేలాది సంస్థలు మూతపడే ప్రమాదం ఉందని, వాటిపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేటీఆర్ కేంద్రానికి కొన్ని కీలక సూచనలు చేశారు. చిన్న వ్యాపారులకు ప్రాధాన్యతనిచ్చేలా ఎల్పీజీ కేటాయింపుల విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. జిల్లాల వారీగా సిలిండర్ల లభ్యతపై పారదర్శక సమాచారం కోసం రియల్-టైమ్ పబ్లిక్ డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షోభ సమయంలో చిన్న వ్యాపారులపై అదనపు భారం పడకుండా వాణిజ్య సిలిండర్ల ధరల పెరుగుదలను తాత్కాలికంగా నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. గృహ వినియోగ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు మళ్లించి, అధిక ధరలకు విక్రయించే బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఐటీ కారిడార్ ప్రాంతాల్లోని పీజీ హాస్టళ్లను ప్రత్యేక కేటగిరీగా గుర్తించి, అంతరాయం లేని సరఫరాను అందించాలని కోరారు. అలాగే, గ్యాస్ ఆధారిత శ్మశానవాటికలను అత్యవసర సేవలుగా వర్గీకరించి, వాటి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా చూడాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. ఇది లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేసే తీవ్రమైన సమస్య అని, వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## మొదటి పేజీ తరువాయి

# భారత్ పతాక నౌకలు హర్మూజ్ నుంచి వెళ్లొచ్చు..

చేరుకుంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ భారత్ కెప్టెన్ హర్మూజ్ మీదుగా దానిని బుధవారం సురక్షితంగా తీసుకువచ్చారు. సౌదీ అరేబియాలోని రాస్ తనురా పోర్ట్‌లో అది చమురు లోడ్ చేసుకుంది. మార్చి ఒకటిన రాస్ తనురా నుంచి బయల్దేరింది.

# లోక్‌సభ స్పీకర్‌కు ఊరట..

## వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

జగదాంబికా పాల్ నిర్వహించిన మూజువాణి ఓటుతో ఈ తీర్మానాన్ని తిరస్కరించారు. అవిశ్వాసంపై హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇస్తున్న సమయంలో ప్రతిపక్షాలు తీవ్ర నినాదాలతో సభను అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్ ఓం బిర్లా పక్షపాతంతో, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావేద్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి 118 మంది విపక్ష ఎంపీలు మద్దతు తెలిపారు. నిన్న చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, ఇది వ్యక్తిగతంగా బిర్లాను లక్ష్యం చేసుకోవడానికి కాదని, పార్లమెంట్ గౌరవాన్ని కాపాడటానికే అని పేర్కొన్నారు. దీనికి బదులిచ్చిన పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, స్పీకర్ పనితీరును గట్టిగా సమర్థించారు. అయితే, చర్చకు సమాధానమిచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్షాల ఆరోపణలను తీవ్రంగా తిప్పికొట్టారు. స్పీకర్ స్థానం అత్యంత పవిత్రమైందని, ఆయన నిర్ణయాలను సుప్రీంకోర్టులో సైతం ప్రశ్నించలేమని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో, నేటి కాంగ్రెస్ మిత్రపక్షాలైన సమాజ్‌వాదీ పార్టీ, కమ్యూనిస్టు పార్టీలే స్పీకర్లపై అవిశ్వాసం పెట్టాయని గుర్తుచేశారు. ఆ సమయంలో స్పీకర్లు చైర్‌లోనే కూర్చోగా, ఈసారి ఓం బిర్లా మాత్రం తీర్మానంపై నిర్ణయం వెలువడే వరకు చైర్‌లో కూర్చోకుండా కొత్త పార్లమెంటరీ సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అమిత్ షా లక్ష్యంగా చేసుకున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు రాహుల్ తరచూ విదేశీ పర్యటనలకు వెళ్తారని, బడ్జెట్, మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి కీలక చర్చల్లో పాల్గొనడానికి ఎందుకు ఇష్టపడరని ప్రశ్నించారు. "సమావేశాలు వచ్చినప్పుడల్లా ఆయన విదేశీ పర్యటనలు ప్లాన్ చేసుకుంటారు. మరి విదేశాల నుంచి ఇక్కడ మాట్లాడతారా?" అని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మొత్తం మీద స్పీకర్‌ను ఇరుకున పెట్టాలనుకున్న ప్రతిపక్షాల వ్యూహం ఫలించలేదు. పైగా ప్రభుత్వ ఎదురుదాడితో ప్రతిపక్షాలే ఆత్మరక్షణలో పడినట్లు కనిపించింది. ఈ పరిణామం విపక్షాలకు రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది.

# ఇది ప్రారంభం మాత్రమే... గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది

కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే మేల్కొని, తగిన ఏర్పాట్లు చేయాలని గురువారం డిమాండ్ చేశారు. పార్లమెంట్ వెలుపల విలేకరులతో మాట్లాడిన రాహుల్ గాంధీ, దేశంలో నెలకొన్న గ్యాస్, ఎల్పీజీ పరిస్థితిపై సభలో మాట్లాడేందుకు తాను ప్రయత్నించగా, తనకు అనుమతి లభించలేదని తెలిపారు. "సాధారణంగా సభలో మాట్లాడటానికి ఒక పద్ధతి ఉంటుంది. కానీ ఇప్పుడు కొత్త విధానం మొదలైనట్లుంది. నేను మాట్లాడాలనుకున్న అంశంపై ముందు మంత్రి నిర్ణయిస్తారు, ఆ తర్వాతే నేను మాట్లాడాలి. మళ్ళీ ఆ తర్వాత మంత్రి స్పందిస్తారు. ఈ కొత్త పద్ధతి ఆశ్చర్యంగా ఉంది" అంటూ ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, "రాబోయే రోజుల్లో గ్యాస్, పెట్రోల్, అన్ని రకాల ఇంధనాలు పెద్ద సమస్యగా మారనున్నాయి. ఎందుకంటే మన ఇంధన భద్రత దెబ్బతింది. ప్రభుత్వ లోపభూయిష్ట విదేశాంగ విధానం ఈ సమస్యను సృష్టించింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రధాని మోదీ మేల్కొని సన్నాహాలు ప్రారంభించాలి. లేకపోతే కోట్లాది మంది ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతారు" అని స్పష్టం చేశారు. ఈ సమస్య కేవలం ఇరాన్ వంటి దేశాలు ఇంధన సరఫరాను అనుమతిస్తాయా లేదా అనేదాని కంటే చాలా పెద్దదని రాహుల్ అన్నారు. "మనం ఒక అస్థిరమైన కాలంలోకి అడుగుపెడుతున్నాం. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా మన ప్రజలు ఇబ్బంది పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని తెలిపారు. తాను చేస్తున్నది రాజకీయ విమర్శ కాదని, రాబోయే పెను ప్రమాదం గురించి కేవలం హెచ్చరిస్తున్నానని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. "ఇది రాజకీయ ప్రకటన కాదు. నా కళ్లకు ఓ పెద్ద సమస్య కనిపిస్తోంది. ప్రపంచం మారుతోంది, దాని నిర్మాణం కూడా మారుతోంది. కాబట్టి మనం కూడా మన ఆలోచనా ధోరణిని మార్చుకోవాలి. స్పష్టతతో పనిచేయకపోతే, మారుతున్న ప్రపంచంలో భారత్‌ను 'కేంద్రంగా' నిలపకపోతే సమస్యలు తప్పవు" అని ఆయన పేర్కొన్నారు.

# రూ.22 వేల పెట్టుబడితో రూ.3.5 లక్షల ఆదాయం

ఫ్యాక్ట్ చెక్ తెలిపింది. గత కొంతకాలంగా పెట్టుబడి పథకాల పేరిట సైబర్ మోసగాళ్లు కొత్త కొత్త మోసాలకు పాల్పడుతున్నారు. అచ్చంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతున్నట్లుగా డీప్ ఫేక్ వీడియోను సృష్టించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ఆ వీడియోల కింద ఇచ్చిన లింక్స్‌పై క్లిక్ చేయాలని సైబర్ నేరగాళ్ళు సూచిస్తున్నారు. వాటిపై క్లిక్ చేస్తే మీ బ్యాంకు ఖాతా ఖాళీ అయ్యే అవకాశముంది. ఈ డీప్ ఫేక్ వీడియోలు వైరల్ అవుతుండటంతో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. అవి ఏఐ జనరేటెడ్ నకిలీ వీడియోలని వెల్లడించింది. ఫేస్‌బుక్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతున్నట్లుగా ఏఐ ద్వారా డిజిటల్‌గా సృష్టించిన ఈ వీడియో పూర్తిగా నకిలీదని తెలిపింది. ప్రధాని మోదీ లేదా ప్రభుత్వం ఇలాంటి ఏ పెట్టుబడి పథకాన్ని ఆమోదించలేదని, ప్రోత్సహించలేదని తెలిపింది. ఇలాంటి పోస్టులతో ఉన్న లింకులపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని, అలాగే మీ వ్యక్తిగత, ఆర్థిక వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించింది. ఏఐ ఆధారిత ఆర్థిక మోసాలకు గురికావొద్దని అప్రమత్తం చేసింది.

# మెగాస్టార్ చిరంజీవికి గంటా అభినందన



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 12:**

తెలంగాణ ప్రభుత్వం ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని ప్రకటించిన నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. గురువారం హైదరాబాద్ లో చిరంజీవిని ఆయన నివాసంలో కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో తెలుగు పరిశ్రమకు తన స్టామినా ఆవిష్కరించిన చిరంజీవి త్వరలో విడుదల కానున్న 'విశ్వంభర'తో కొత్త రికార్డులు అందుకుంటారని పేర్కొన్నారు. భవిష్యత్ లో చిరంజీవి మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# మహిళల సమస్యల పరిష్కారానికి జడ్పీలో నేడు జన్ సున్వాయి

### మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఆధ్వర్యంలో ఫిర్యాదుల విచారణ

### విశాఖపట్టణం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల మహిళలకు అవకాశం

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 13**

మహిళలకు సంబంధించిన ఫిర్యాదులను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో "మహిళా జన్ సున్వాయి" (పబ్లిక్ హియరింగ్) కార్యక్రమం విశాఖపట్నంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో శుక్రవారం నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ కె.వి. రామలక్ష్మి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్, జాతీయ మహిళా కమిషన్ సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించే ఉద్దేశంతో మార్చి 9 నుంచి 13 వరకు మహిళా జన్ సున్వాయి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దానిలో భాగంగా విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన మహిళల కోసం ఈ జన్ సున్వాయి కార్యక్రమాన్ని జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.00 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, కమిషన్ సభ్యులు హాజరై మహిళల నుంచి వచ్చిన పెండింగ్ ఫిర్యాదులు, అలాగే వాక్-ఇన్ ఫిర్యాదులను స్వీకరించి విచారణ చేపడతారన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటన ద్వారా ఆమె కోరారు.

# పారిశుధ్య సిబ్బందికి అమలు చేస్తున్న పథకాలు, భద్రతపై అవగాహన.



**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్,మార్చి 12**

స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర సాధనలో భాగంగా నగరంలోని 20వ వార్డు చినవాల్తేరు రజక వీధి సామాజిక భవనంలో పారిశుద్ధ్య సిబ్బందికి వాష్, సహాస్ సంస్థల ద్వారా శిక్షణను ఇచ్చారు. సుమారు 50 మంది సిబ్బంది పాల్గొన్న ఈ శిక్షణ కార్యక్రమంలో వాష్ ఇన్స్టిట్యూట్ జిల్లా కోఆర్డినేటర్ పి. లలితాదేవి, రిసోర్స్ పర్సన్ హరనాథ్ పాల్గొన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ప్రజలను ఘన వ్యర్థాల నిర్వహణపై చైతన్యం చేసే విధానం, పని ప్రదేశంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆరోగ్య రక్షణకు పాటించవలసిన సూత్రాలు, నమస్తే పథకం విధి విధానాలు, పారిశుధ్య కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ డైరక్టర్ బుచ్చా రామిరెడ్డి, నాగలక్ష్మి, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రకాష్, 20వ వార్డు పారిశుధ్య సూపెర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతోనే జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### - జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఒక పండగల నిర్వహిద్దాం... - పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు...







**పరవాడ, సిటిజన్ టైమ్స్, మార్చి12:**

ప్రజల కోసమే ఏర్పడిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అయిన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవ వేడుకలు అయినా కేవలం సేవా కార్యక్రమాలతోనే జరుపుకుంటామని ఆ పార్టీ విశాఖ ఉమ్మడి రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు స్పష్టం చేశారు. పెందుర్తి నియోజకవర్గం సుజాతనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు కార్యకర్తలు వీర మహిళలతో గురువారం మధ్యాహ్నం ఈనెల 14న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సందర్భంగా ముందస్తు సన్నద్ధత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పార్టీ పతాక ఆవిష్కరణ, సేవా కార్యక్రమాల్లో భాగంగా నియోజవర్గం లో అన్ని గ్రామాల్లోని, వార్డుల్లో ని ,మండల కేంద్రాలలో పార్టీ పతాక ఆవిష్కరణలు, సేవా కార్యక్రమాలలో భాగంగా రక్తదాన శిబిరాలు, అన్నదాన సమారాధనలు, రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలతో మాత్రమే జనసైనికులు, వీర మహిళలు జరుపుకుంటారని వెల్లడించారు. అలాగే అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు కూడా నిరాడంబరంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఈనెల 14న జనసేన అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాడేరు గిరిజన ప్రాంతాల్లో పర్యటించి అక్కడి వారితో కలిసి వేడుకలు జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జన సైనికులు ఉత్సాహంగా పాల్గొనాలని, అలాగే ప్రజలందరూ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే రమేష్ బాబు పిలుపునిచ్చారు. జనసేన సభ్యత్వంలో పెందుర్తి నియోజకవర్గం పిఠాపురం తర్వాత ప్రస్తుతం రెండో స్థానంలో ఉందని పేర్కొన్నారు. వచ్చే ఐదు రోజుల్లో ఆ సంఖ్యను మరింత పెంచుతామని తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలు జనసేన సభ్యత్వం లో ఉత్సాహంగా పాల్గొంటున్నారని, అయితే కొందరు మాత్రం కాసింత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. పదవి ఆశించే వారు, పార్టీలో ఉన్నతంగా ఎదగాలనుకునేవారు ఇలాంటి కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొనాలని ఉద్బోధించారు. ఈ యొక్క సమావేశ కార్యక్రమంలో పెందుర్తి పిఏసిఎస్ చైర్మన్ అయితే సింహాచలం,రాష్ట్ర కనీస వేతనాలు డైరెక్టర్ బలిరెడ్డి అప్పారావు,జిల్లా జనసేన పార్టీ కార్యవర్గ సభ్యులు ఇందల రమణ, విశాఖ ఉమ్మడి రూరల్ జిల్లాల కార్యదర్శి బుగిడి రామ గోవింద రావు,సీనియర్ నాయకులు సాలాపు వెంకటేశ్వరరావు,మండల పార్టీ అధ్యక్షులు కర్రీ కనకరాజు, కొరుపోలు రామనాయుడు,పెందుర్తి ఏఎంసి డైరెక్టర్ హైమావతి, లక్కీ గోవింద్,ఆర్ఎస్ నాయుడు, సంతోష్,వార్డు అధ్యక్షులు సేనాపతి సోము శేఖర్, పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు,ఆది బాబు, డి బి ఎల్ నాయుడు,కాకి బాబు, పిల్లా శివ కృష్ణ, పెందుర్తి సిహెచ్ సి నెంబర్ వరూధిని, సర్పంచులు మోటార్ సన్యాసి నాయుడు, మామిడి శంకర్రావు,బోకం స్వామి నాయుడు,మండల నాయకులు వేగి దివాకర్,బంతిగొల్ల పద్మ, వర్రి పరదేశి నాయుడు,కరణం నరసింహారావు, గంగు పావని,నాయుడు, సత్తివాడ జ్యోతి,జయలక్ష్మి, మొదలగు పెందుర్తి నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కిడ్నీ వ్యాధులపై విస్తృత అవగాహన అవసరం

### -అవయువదానంపై ప్రజలకు తెలియజేయండి

### -విమ్స్‌లో జీవన్‌ధాన్ ఆధ్వర్యంలో కిడ్నీ దినోత్సవం

### -పాల్గొన్న ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ రవిరాజు, విమ్స్ డైరెక్టర్ రాంబాబు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి12:**

జీవనశైలి, ఇతర ఆహారపు అలవాట్ల కారణంగా అధికమవుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులంతా సకాలంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ మాజీ వీసీ, ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ టివి రవిరాజు అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం విమ్స్ ఆసుపత్రిలో రాష్ట్ర జీవన్‌ధాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు పర్యవేక్షణలో నగరంలోని పలు జీవన్‌ధాన్ పథకం అమలు చేస్తున్న ఆసుపత్రుల సీఈవో?లు, కో-ఆర్డినేటర్లు, ఇతర వైద్యసిబ్బందితో కలసి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ టివి రవిరాజు మాట్లాడుతూ రోజురోజుకి పెరుగుతున్న కిడ్నీ వ్యాధి, వాటి నివారణ చర్యలపై గ్రామ స్థాయి నుంచి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కిడ్ని ట్రాన్స్‌ఫ్లాంటేషన్ కోసం గతంలో చాలా మంది ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం జీవన్‌ధాన్ పథకం ఏపీలో పక్కగా అమలువుతున్న నేపధ్యంలో కొంత మేర కిడ్నీ రోగులకు సకాలంలో ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేస్తున్నారన్నారు. జీవన్‌ధాన్ పథకాన్ని దేశంలోనే టాప్ -6లో నిలిపిన డాక్టర్ రాంబాబు సేవలను ప్రశంసించారు. ప్రపంచ దేశాల్లో 850 మిలియన్ ప్రజలు ప్రస్తుతం కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, మన దేశంలో 115 మిలియన్ ప్రజలు బాధితులుగా ఉన్నారన్నారు. ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ద్వారా రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలందిస్తున్నామన్నారు. రాష్ట్ర జీవన్‌ధాన్ కో-ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ అవయువదానంపై ప్రజలకు అన్ని రకాలుగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అదే విధంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సైతం భాగస్వామ్యం చేస్తూ బ్రెయిన్‌డెడ్ అయిన రోగుల నుంచి అవయువాలను సేకరిస్తూ, కిడ్నీ ట్రాన్స్‌ఫ్లాంటేషన్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా జీవన్‌ధాన్ పథకానికి సంబంధించి కూడా అన్ని రకాల సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ఎం సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరిండింటెంట్ డాక్టర్ ఐ.వాణి, కిమ్స్ ఆసుపత్రి రీజనల్ హెడ్ నాగేశ్వరరావు,కేర్ ఆసుపత్రి సీఈవో సాదన్ కుమార్, అపోలో ఆసుపత్రి సీఈవో కృష్ణ ప్రసాద్, సివెన్‌హిల్స్ సీఈవో గిరిబాబు, మెడికవర్ ఆసుపత్రి సీఈవో నరేంద్ర బెండితో పాటు పలువురు నెఫ్రాలజిస్టులు, ఇతర జీవన్‌ధాన్ కో-ఆర్డినేటర్లు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ నిధులు విడుదల



**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, మార్చి12:**

అన్నదాత సుఖీభవ,పిఎం కిసాన్ పథకం కింద జిల్లావ్యాప్తంగా రూ.134.27 కోట్ల నిధులు 2,42,536 మంది రైతుల ఖాతాల్లో నేడు జమ కానున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ గురువారం ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి నియోజకవర్గంలోని 22,202 లబ్ధిదారులకు రూ.12.30 కోట్లు,చోడవరం నియోజకవర్గంలోని 51,269 లబ్ధిదారులకు రూ. 28.38 కోట్లు,వడ్డది మాడుగుల నియోజకవర్గంలోని 45,604 లబ్ధిదారులకు రూ.25,25 కోట్లు,నర్సీపట్నం నియోజకవర్గంలోని 35,147 లబ్ధిదారులకు రూ. 19.69 కోట్లు,పాయకరావుపేట నియోజకవర్గంలోని 39,302 లబ్ధిదారులకు రూ. 21.67 కోట్లు,పెందుర్తి నియోజకవర్గంలోని 15,364 లబ్ధిదారులకు రూ.8.54 కోట్లు,యలమంచిలి నియోజకవర్గంలోని 33,648 లబ్ధిదారులకు రూ. 18.45 కోట్లు వెరసి జిల్లాలో మొత్తం 2,42,536 లబ్ధిదారులకు రూ. 134.27 కోట్లు 3వ విడత అన్నదాత సుఖీభవ,22వ విడత కిసాన్ నిధులు విడుదల కానున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ప్రకటన లో తెలిపారు.

# రానున్నది వైసిపి ప్రభుత్వమే...

### -మజ్జి చిన శ్రీను జోస్యం

**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, మార్చి12:**

వైయస్సార్సీపీకి పూర్వ వైభవం రానుందని వైయస్సార్సీపి భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు.గురువారం ఆనందపురం వైయస్సార్సీపి పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరిచేత్తో సూర్యుడిని ఆపడం ఎంత అసాధ్యమో, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని ఆపడం కూడా అంతే అసాధ్యమన్నారు. 2029లో మళ్లీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై, జగన్ ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ఇప్పటి నుంచే నడుం బిగించాలని పిలుపునిచ్చారు. వైయస్సార్సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చారని ఆయన తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ల



కాలం అయినప్పటికీ ఏ హామీ నెరవేరలేదని గుర్తు చేశారు. ఈ సందర్భంగా చిన్న శీను తన కుమార్తె మజ్జి సిరి సహస్ర (సిరమ్మ)మరియు భీమిలి నియోజకవర్గ పరిశీలకులు, మాజీ శాసనసభ్యులు తైనాల విజయకుమార్ తో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి, వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆనందపురం జడ్పిటిసి కోరాడ



వెంకట్రావు, మండల వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, భీమిలి,పద్మనాభం ఎంపీపీలు వాసు రాజు, రాంబాబు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, మండల పార్టీ ఉపాధ్యక్షులు సినగం దాము, సీనియర్ నాయకులు బోని అప్పలనాయుడు, గండ్రెడ్డి శ్రీనివాసరావు, చందక సూరిబాబు , యువ నాయకులు కోరాడముసలి నాయుడు,ఇల్లాపు వెంకట్ జగన్, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


# టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి12:**

ఆనందపురం మండలం శిర్లపాలెం గ్రామంలో ఉన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల లో 10 వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు వారికి అవసరమైన సామాగ్రిని అందజేసిన భీమిలి నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బూర్లె వికాస్ కుమార్(అంజి).ఈ కార్యక్రమం లో స్కూల్ కమిటీ చైర్మన్ కోరాడ గౌరీ,గ్రామ సర్పంచ్ సిర్ల అప్పలనాయుడు,మాజీ సర్పంచ్ బూర్లె రమణ,ఉప సర్పంచ్ గుసిడి అప్పలరాజు, పాఠశాల హెచ్ఎం శారద మరియు పాఠశాల సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కపిలేశ్వరపురం మండలంలో ఘనంగా వై.ఎస్.ఆర్ పార్టీ16వ ఆవిర్భావ దినోత్సవం





**కపిలేశ్వరపురం సిటిజన్ టైమ్స్ ఫిబ్రవరి 12**

మండలం కేంద్రం కపిలేశ్వరపురం,అంగర గ్రామాలలో వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ, ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగర ,కపిలేశ్వరపురం గ్రామాలలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గూటం సత్యనారాయణ , కపిలేశ్వరపురం గ్రామ అధ్యక్షుడు అంగాని నూక రాజు ల ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు ఘనంగా వేసి నివాళులు అర్పించారు. జండా ఆవిష్కరించిన అనంతరం కేక్ కట్ చేసి వైసీపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియ చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ జుత్తుక వెంకటలక్ష్మి, వైసీపీ నాయకుడు మేడిశెట్టి దుర్గారావు, పుట్టా కృష్ణ బాబు,నక్కా సింహాచలం లు వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉద్దేశించి మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికలు లో సూపర్ సిక్స్ పేరిట అమలుకు నోచుకొని హామీలు ఇచ్చి, గద్దె ఎక్కిన సీఎం చంద్రబాబు నాయుడు రెండు యేండ్ల పాలనలో ప్రజల విశ్వాసం కోల్పోయారని వైసీపీ శ్రేణులు పేర్కొన్నారు. కుల, మత, వర్గ, ప్రాంతీయ, పార్టీ రహితంగా అర్హులు అయిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేసిన జగన్ మోహన్ రెడ్డి పాలన పై ప్రజలు మరల మొగ్గు చూపుతున్నారని నాయకులు వివరించారు. వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వ్యక్తిగత విబేధాలు పక్కన పెట్టి, 2029 ఎన్నికలు లో జగన్ మోహన్ రెడ్డి సీఎం చెయ్యడమే ద్యేయంగా ప్రతీ కార్యకర్త సైనికుడు వలె కృషి చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వైసీపీ శ్రేణులకు స్వీట్లు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో విప్ పలివెల మధు,ఎంపిటిసి లు అడ్డాల శ్రీనివాస్, ఎమ్. దుర్గారావు, గొల్లపల్లి సోనియా, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, పిప్పర సంపత్ రావు, కపిలేశ్వరపురం గ్రామం వైసీపీ వైస్ ప్రెసిడెంట్ లు నీతిపూడి శేఖర్ బాబు, మేడిశెట్టి శ్రీను, ప్రధాన కార్యదర్శి కన్నా శ్రీను, చింతా పెద్ద కాపు, కత్తి మహేష్ విజయ్, కట్టా మురళి, కుడుపూడి విజయ్,పేరాబత్తుల రామకృష్ణ, పాలంగి కిశోర్, కె.రాజేష్, పి.శ్రీను,అధిక సంఖ్యలో వై ఎస్ ఆర్ కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెండో రోజు జరిగిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న షణ్మోహన్

### కలెక్టర్ల సమావేశానికి హాజరైన మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు





**కాకినాడ సిటిజన్ టైమ్స్ మార్చి 12**

పెట్టుబడులు, వైద్యం, సూపర్ సిక్స్-సంక్షేమం, భూ పరిపాలన, ఆదాయార్జన శాఖలు,విద్య-నైపుణ్యాభి వృద్ధి, ఇళ్ల నిర్మాణం, వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలు తదితర అంశాలపై రెండో రోజు కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు.

## రంగాపురం బహిరంగ సిలువ మార్గం



**లింగపాలెం (సిటిజన్ టైమ్స్) మార్చి 12**

లింగపాలెం మండలం లో రంగాపురం గ్రామంలో దినముల సందర్భంగా ఈరోజు స్వాములు మరియు ఫాదర్ రాజేష్ కుమార్ గారి ఆధ్వర్యంలో బహిరంగ సిలువ మార్గం కార్యక్రమం జరిగింది.

## రాజస్థాన్ జలోర్ నుండి మొదలు పెట్టి కాశ్మీర్ టు కన్య కుమారి వరకు ప్రముఖ దేవాలయాలు పాదయాత్ర చేస్తున్న కేసా రామ్.......

**పిఠాపురం:సిటిజన్ టైమ్స్, మార్చి 12**

కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గం, పిఠాపురం పట్టణం, రాజస్థాన్ జలోర్ నుండి మొదలు పెట్టి కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ప్రముఖ దేవాలయాలు పాదయాత్ర చేస్తున్న కేసా రామ్ గురువారం పిఠాపురం చేరుకున్నారు. వారిని పిఠాపురం మార్వాడీ విష్ణు సమాజ్ వారు, విశ్వ హైందవ పరిషత్ నాయకులు, కలిసి అయనకు స్వాగతం పలికారు. అనంతరం కేసా రామ్ పాదగయ పుణ్య క్షేత్రం శివయ్య దర్శనం చేసుకున్నారు. కేసా రామ్ మాట్లాడుతూ, మొత్తం 1200 వేల కిలోమీటర్లు పాదయాత్ర అని, ప్రముఖ పుణ్యక్షేత్రాలు దర్శనం చేసుకుంటూ వస్తున్న అని, ఒక సంవత్సరశీ నుండి ఈ పాదయాత్ర మొదలు పెట్టాను అని, ఇప్పటికీ 6000 వేల కిలోమీటర్లు యాత్ర పూర్తి చేశానని, నా ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశ్యం మన దేశం సురక్షితం గా ఉండాలని, మన దేశ సైనికులకు సదా ఆ మహా శివుడి రక్ష ఉండాలి అని, అఖండ భారత్ సంకల్పం తో ఈ పాదయాత్ర చేస్తున్న అని,ఆయన తెలిపారు. అనంతరం ఆయన సామర్లకోట పాదయాత్ర గా బయలుదేరారు.



## జిల్లాలో వినియోగదారుల అవసరాలకు సరిపడా పూర్తి స్థాయిలో ఎల్పీజీ నిల్వలు అందుబాటులో ఉన్నాయి..

### సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లు నమ్మి అపోహలు, ఆందోళనలకు గురికావద్దు .




**కాకినాడ సిటిజన్ టైమ్స్ మార్చి 12**

మధ్యప్రాచ్య దేశాలలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపధ్యంలో జిల్లాలో వినియోగదారుకు వంటగ్యాస్ సరఫరా పరంగా ఎటువంటి ఇబ్బందులు కలుకుండా అన్ని చర్యలు పటిష్టంగా చేపట్టామని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలియజేసారు. గురువారం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.ఎస్.ఆర్.రాజుతో కలిసి మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి జిల్లాలో వంటగ్యాస్ నిల్వల పరిస్థితి సరఫరా, వినియోగదారులకు ఇబ్బంందులు తలెత్తకుండా చేపట్టిన చర్యలను వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరాన్, ఇజ్రాయిల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితుల మూలంగా గ్యాస్ నిల్వలు తగ్గి,ధరలు పెరగుతాయని సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి వినియోగదారులు ఎవరు ఆందోళన చెందవద్దని కోరారు. జిల్లాలో వినియోగదారులు అవసరాలకు తగిన ఎల్పీజీ నిల్వలు వివిద ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల చెందిన 45 ఎల్పీజీ డీలర్ల వద్ద ఉన్నాయని, ప్రభుత్వం నిర్థేశించిన బుకింగ్ సైకిల్ ప్రకారం పంపిణీలో గృహావసర వినియోగదాలకే ప్రాధ్యత నిస్తున్నామని తెలిపారు. జిల్లాలో డొమెస్టిక్ ఎల్పీజీ వినియోగదారులకు పంపిణీ చేసేందుకు రోజుకు సగటున 11,000 సిలిండర్లు అవసరమై ఉండగా, డీలర్ల వద్ద 14,756 సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, వినియోగదారులకు ఫస్ట్ ఇన్ -- ఫస్ట్ అవుట్ విధానంలో వాటిని పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. రోజు వారీ నిల్వలు, బుకింగ్, పంపిణీ వివరాలను పారదర్శంగా ఏజెన్సీలలో ప్రదర్శించాలని డీలర్లను ఆదేశించామని, అలాగే ఆర్డిఓలు, తహశిల్దారులు 21 మండలాల్లో గ్యాస్ ఏజెన్సీలను నిత్యం తనిఖీ చేసి గ్యాస్ నిల్వపై ప్రజలకు అవగాహన కల్పించి సోషల్ మీడియా అసత్య ప్రచారల వల్ల ప్రజలలో కలుగుతున్న అపోహలను తొలగిస్తున్నారని జెసి తెలిపారు.సిలిండర్ల పంపిణీకి సంబంధించి వినియోగదారులు ఎవరికైనా, ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా డిఎస్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 8886903611 కు తెలియజేస్తే వెంటనే చర్యలు చేపట్టి పరిష్కరిస్తున్నామన్నారు. విశాఖపట్నంలో ఉన్న బోటిలింగ్ యూనిట్లలో సిలిండర్లు నింపే ప్రక్రియ పూర్తి సామర్థ్యంతో జరుగుతోందని, జిల్లాకు సిలిండర్లు ఎటువంటి అంతరాయం లేకుండా సరఫరా అవుతున్నాయని తెలియజేశారు.ఎల్పీజీ సిలిండర్ల సరఫరా,నిల్వలు, పంపణీ అంశాలను తాను స్వయంగా రోజూ ఆయిల్ కంపెనీలు,ఎల్పిజీ డిస్ట్రిబ్యూటర్లతో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాని జెసీ తెలియజేశారు.గృహ వినియోగదారులతో బాటు సంక్షేమ హాస్టళ్లు, ఆసుపత్రులకు కూడా ప్రాధాన్యతగా గ్యాస్ సరఫరా చేస్తున్నామన్నారు.జిల్లాలో వంటగ్యాస్ సరఫరా సజావుగా జరుగుతోందన్నారు.ఎల్పీజీ నిల్వలు, పంపిణీ గురించి ప్రభుత్వ అధికారిక మార్గాల ద్వారా విడుదల చేస్తున్న సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని,పుకార్లను నమ్మి అనవసరమైన అపోహలు, ఆందోళనలతో పానిక్ బయింగ్ చేయవద్దని, అవసరం ఉన్నపుడే సిలిండర్లు కొనుగోలు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

## నేడు అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ నిధుల విడుదల..

### రైతుల ఖాతాల్లో రూ 84.80 కోట్ల జమ..

### జిల్లాలో 1,50,475 మందికి లబ్ధి..

**కాకినాడ సిటిజన్ టైమ్స్ మార్చి 12**



అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ‘అన్నదాత సుఖీభవ -- పీఎం-కిసాన్’ పథకం కింద, రాష్ట్రంలోని అర్హులైన రైతులకు మూడవ విడత ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం సిద్ధమైంది.ఈ పథకం ద్వారా భూమి కలిగిన రైతు కుటుంబాల కు ఆర్ఓఎఫ్ఆర్ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు ఏడాదికి మొత్తం రూ. 20,000 చొప్పున (అన్నదాత సుఖీభవ నుంచి రూ. 14,000, పీఎం-కిసాన్ నుంచి రూ. 6,000) మూడు విడతల్లో ప్రభుత్వం అందజేస్తోంది. ప్రభుత్వం మూడవ విడత నిధులను రూ.6,000 చొప్పున శుక్రవారం రైతుల ఖాతాల్లో జమచేయనుంది.

**కాకినాడ జిల్లాలో మూడవ విడత వివరాలు:** 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, మూడవ విడత నిధులను మార్చి 13న ప్రభుత్వం విడుదల చేయనుంది.దీని కింద అన్నదాత సుఖీభవ పథకం నుంచి రూ.4,000 మరియు పీఎం-కిసాన్ పథకం నుంచి రూ. 2,000 కలిపి, మొత్తం రూ. 6,000 లబ్ధిదారులైన రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. మొదటి విడతగా 2025 ఆగస్టు 2న, రెండవ విడతగా 2025 నవంబరు 19న రైతుల ఖాతాల్లో రూ.7,000 చొప్పున జమ చేయడం జరిగింది.

**కార్యక్రమ వివరాలు:** అన్నదాత సుఖీభవ-పిఎం -కిసాన్ మూడవ విడత నిధుల విడుదలకు సంబంధించి రాష్ట్ర స్థాయి కార్యక్రమం శుక్రవారం కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో సాయంత్రం 4:00 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని రైతులకు నగదు జమ చేస్తారు. అదే రోజు జాతీయ స్థాయి కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అస్సాంలోని గువాహటిలో సాయంత్రం 5:00 గంటలకు ప్రారంభించనున్నారు.

**జిల్లా రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలి.. జిల్లా కలెక్టర్ షణ్మోహన్..:** అన్నదాత సుఖీభవ- పిఎం-కిసాన్ పథకం ద్వారా జిల్లాలో మూడవ విడతలో మొత్తం 1,50,475 మంది రైతులు ప్రయోజనం పొందనున్నారు. వీరి ఖాతాల్లో సుమారు రూ.84.80 కోట్ల ఆర్థిక సహాయం జమ కానుంది. ఈ నగదును రైతులు తమ తదుపరి పంట సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇతర వ్యవసాయ అవసరాల కోసం వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి కోరారు.

## ధర్మాజీగూడెం లో రేపు అన్నదాత సుఖీభవ సభ



**లింగపాలెం (సిటిజన్ టైమ్స్) మార్చి 12**

లింగపాలెం మండలం ధర్మాజీగూడెం పెట్రోల్ బంక్ ఎదురుగా అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కూటమి నాయకులు తెలిపారు సభా ప్రాంగణం ఏర్పాట్లను వ్యవసాయ శాఖ అధికారులు కూటమి నాయకులు పరిశీలించారు కార్యక్రమానికి ఎమ్మెల్యే రోషన్ కుమార్ గారు హాజరవుతారని కూటమి నాయకులు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు అలాగే మూడో విడత అన్నదాత సుఖీభవ కింద నగదు జమ చేయడం జరుగుతుంది అని తెలిపారు.

## జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన పిఠాపురం ఆర్చర్స్....




**పిఠాపురం సిటిజన్ టైమ్స్, మార్చి 12**

కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గం, పిఠాపురం పట్టణం లో, ఈనెల 11వ తేదీ బుధవారం నాడు ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ వారు, కృష్ణా జిల్లా నూజివీడులో నిర్వహించిన అండర్ 10 ఇండియన్ రౌండ్ బాల,బాలికల, విభాగంలో పిఠాపురం లో కోచ్ లక్ష్మణరావు దగ్గర శిక్షణ తీసుకుంటున్న ముగ్గురు అర్చర్స్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. వీరు ఈ నెల 28 నుండి 30వ తేదీ వరకు గుంటూరు జిల్లాలో జరుగుతున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్టం నుండి పాల్గొంటారని, కోచ్ లక్ష్మణరావు తెలిపారు. జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన ఆర్చర్స్ ను పిఠాపురం మాజీ శాసనసభ్యులు ఎస్ వి ఎస్ ఎన్ వర్మ అభినందించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారు ముమ్మడి నిత్యశ్రీ, ఎన్.దుర్గ తేజశ్వి, కె.సంపత్ జై ఎంపికయ్యారని, కోచ్ లక్ష్మణరావు తెలిపారు.

# 33/11 కె. వి సబ్ స్టేషన్ ఏర్పాటు.

**అధికారులు ఆదేశించిన ఎమ్మెల్యే రోషన్ కుమార్.**



**చింతలపూడి:( సిటిజన్ టైమ్స్ ): మార్చి:12**

చింతలపూడి పట్టణంలోలో ఓల్టేజ్ సమస్య అధిగమించడానికి మరో 33/11 విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రతిపాదించాల్సిందిగా చింతలపూడి శాసనసభ్యులు రోషన్ కుమార్ అధికారులను ఆదేశించారు. చింతలపూడి లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల అమలుపై శాసనసభ్యులు సమీక్షించారు. గురువారం స్థానిక సి వి ఏ పికార్యాలయంలో మున్సిపల్, రెవిన్యూ, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను సమన్వయంతో సమర్ధవంతంగా పూర్తి చేయాలని సూచించారు. చింతలపూడి పట్టణములో "అన్నా క్యాంటీన్ "ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాల్సిందిగా మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆదేశించారు. గతంలో కొన్ని దశాబ్దాల పాటు వినియోగంలో ఉన్న వెలమపేట నుండి కాంతం పాలెం వెళ్లే రహదారి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రెవిన్యూ మున్సిపల్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

# వైఎస్సార్సిపి 16వ ఆవిర్భావ దినోత్సవము...

**వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసిన కెఎస్ఎన్**



**మలికిపురం సిటిజన్ టైమ్స్, మార్చి 12**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, పార్టీ పట్ల ఉన్న అభిమానాన్ని సేవా రూపంలో చాటుకుంటూ రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామంలోని "మేరీ మాత వృద్ధాశ్రమంలో" వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ కార్యక్రమం నిర్వహించినారు. వైసిపి సి ఈ సి సభ్యులు కెఎస్ఎన్ రాజు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజోలు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి పాల్గొని, తన చేతుల మీదుగా వృద్ధులకు పండ్లు, ఫలహారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్రప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి -రుద్రరాజు



**రాజోలు సిటిజన్ టైమ్స్, మార్చి 12**

కేంద్రప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని పీసీసీ సభ్యులు రుద్రరాజు గోపాలకృష్ణ రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా రాజోలు నియోజకవర్గం లక్కవరంలో గురువారం రుద్రరాజు గోపాలకృష్ణ రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుతం గ్యాస్ సిలిండర్ ధరను అదనంగా 60 రూపాయిలు పెంచడం సరికాదన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల రేట్లు విపరీతంగా పెరిగిపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రుద్రరాజు గోపాలకృష్ణరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ బుక్ చేసిన 21 రోజులకు సిలిండర్ ఇస్తామని, నమ్మబలికిన కేంద్రప్రభుత్వం 25 రోజులకు పెంచినప్పటికీ ప్రజలు మౌనంగా ఉన్నారని, ఇప్పుడు 45 రోజులకు పెంచితే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని రుద్రరాజు గోపాలకృష్ణరాజు అన్నారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించే వరకూ కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా ఆందోళన చేపట్టుతుందని ఈ సందర్భంగా రుద్రరాజు గోపాలకృష్ణరాజు తెలియచేశారు.

# గ్యాస్ కొరత ఉండబోదు- వదంతులు నమ్మవద్దు

## జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి






**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 12**

ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య అకస్మాత్తుగా యుద్ధం సంభవించిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర,ప్రభుత్వాలు గ్యాస్ సరఫరా పై తీసుకున్న ప్రత్యేక చర్యలు మూలంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గృహ వినియోగదారులకు గ్యాస్ సరఫరా లో ఎటువంటి కొరత ఉండదని యధావిధిగా సరఫరా కొనసాగుతుందని జిల్లా సంయుక్త కలెక్టర్ టీ. నిశాంతి స్పష్టం చేశారు. గురువారం స్థానిక కలెక్ట రేట్ నందు జిల్లా పరిధిలోని భారత్ పెట్రోలియం హిందుస్థాన్ పెట్రోలియం ఇండియన్ పెట్రోలియం కంపెనీల డీలర్లతో సమావేశం నిర్వహించి ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తుతం గ్యాస్ సరఫరా విధి విధానాలపై సమీక్షించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ యుద్ధ నేపథ్యంలో గ్యాస్ సరఫరా పై వస్తున్న పుకార్లు వదంతులు నమ్మవద్దని డీలర్లు గృహ వినియోగదారులు బాధ్య త గల పౌరులుగా ప్రభుత్వ సమాచారాన్ని విశ్వ సించి ప్రభుత్వానికి సహ కరించా లని సూచించారు ఇటీవల కాలంలో గ్యాస్ సరఫరా పరిణామాల కారణంగా పెట్రోలియం సహజ వాయువు రంగాలలో కొన్ని భయాలు ఏర్పడ్డాయని, వీటిని నమ్మవద్దని గ్యాస్ సరఫరాలో ఎటువంటి కొరత ఉండబోదన్నారు. ఎల్పిజి విషయంలో వెంటనే కొరత లేనప్పటికీ. ఎల్పిజిని ఆదా చేయడానికి కొన్ని చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గృహ వినియోగదా రులు భయపడి ఒకే కు టుంబంలో రెండు, మూడు గ్యాస్ కనెక్షన్ ఉన్నవారు బల్క్ బుకింగ్లు చేయకుండా డీలర్లు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ నిర్దేశిత సమయాలలోనే బుకింగ్లకు అనుమతించాలని ఆదేశించారు. డీలర్లు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజలలో గ్యాస్ సరఫరా పట్ల నమ్మకాన్ని విశ్వసనీయతను పెంపొందిస్తూ ఎక్కడ గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేకుండా ఆన్లైన్ సేవల ద్వారా బుకింగ్ చేయాలని స్పష్టం చేశారు. భారతదేశం గల్ఫ్పై మాత్రమే ఆధారపడటం లేదని వివిధ దేశాల నుండి దిగుమతులు జరుగుతున్నందున, ప్రస్తుత గ్యాస్ కొరతను అధిగమించవచ్చు నన్నారు. సామాజిక మా ధ్యమాలలో నిరాధారమైన కథనాల కారణంగా గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేనప్పటికీ, ప్రజలు భయాందోళనలకు గుర వుతున్నారన్నారు. పానిక్ బుకింగ్లు బాగా పెరగ కుండా కృత్రిమ కొరతను సృష్టించకుండా డీలర్లు ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరించాలన్నారు. ముందు జాగ్రత్త చర్యగా వాణిజ్య సిలిండర్ల సరఫరాను చమురు కంపె నీలు పూర్తిగా నిలిపివేసాయన్నారు. హోటల్స్, ఫుడ్ కోర్టులు,రెస్టారెంట్లు,టీ స్టాళ్లు ఇతర రకాల ఇంధన వనరులను వినియోగించుకోవాలని సూచించారు. మొదటగా గృహ అవస రాలకు రెండో ప్రాధాన్యత గా ఆసుపత్రుల అవస రాలకు గ్యాస్ సరఫరా చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి మధ్యాహ్న భోజన పథకం అంగన్వాడీ కేంద్రాలకు నిరంతరాయంగా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. ఈ రంగాలకు రెండు రోజులు సరఫరా నిలిపి వేయడం సాంకేతిక సమస్య కారణంగానే జరిగిందన్నారు. సింగిల్ సిలిండర్ కనెక్షన్ల బుకింగ్లకు 21 రోజుల పరిమి తిని, డబుల్ సిలిండర్ కనెక్షన్లకు 30 రోజుల పరిమితిని పానిక్ బుకింగ్ను నివారించడానికి ప్రవేశపెట్టారన్నారు. ఇంటి వద్ద గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసే సమయంలో ఓటిపి వ్యవస్థను ప్రవేశ పెట్టారన్నారు. డెలివరీ బాయ్ ఓటిపి ఆధారంగా మాత్రమే రీఫిల్ను డెలివరీ చేయాలని డెలివరీ ప్రక్రియను ఫోటో తీసి ప్రసారమాధ్యమాలలో విస్తృత ప్రచారం గావిం చాలన్నారు. గృహ వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు ఉన్నట్లయితే డీఎస్ఓ కార్యాలయంలో 984814 1965 ఫోన్ నంబర్తో కంట్రోల్ రూమ్ లో సంప్రదించాలన్నారు. గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనాలకు మళ్లించడంపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. గ్యాస్ రోజువారీగా సమీక్షిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ పి. శ్రీనివాస్, ఏ ఎస్ ఓ శరత్ డీలర్లు పాల్గొన్నారు.

# దస్త్రాల పరిష్కారం రాష్ట్రంలో ప్రథమ స్థానం

**జాయింట్ కలెక్టర్ నిషాంతి -ప్రథమ స్థానం సాధించడం అభినందనీయం**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ -పరిపాలనాధికారి కదలి కాశీ విశ్వేశ్వరరావు**

**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 12**



ఇ-ఆఫీస్ ద్వారా దస్త్రాల పరిష్కారంలో రాష్ట్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా సంయుక్త కలెక్టర్ టి.నిశాంతి పేర్కొన్నారు. అమరావతిలో ముఖ్య మంత్రి ఈనెల 11 ,12 తేదీలలో జిల్లా కలెక్టర్ లతో నిర్వహిస్తున్న సమీక్షా సమావేశంలో ఇ -ఆఫీస్ ద్వారా ఫైల్స్ పరిష్కారంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా సంయుక్త కలెక్టర్లు జాబితా ప్రభుత్వం విడుదల చేసిందని జె సి తెలిపారు. ఈ జాబితాల్లో సంయుక్త కలెక్టర్ల కేటగిరీ లో డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సంయుక్త కలెక్టర్గా విధులు నిర్వర్తిస్తున్న టి.నిశాంతి ప్రథమస్థానం లో నిలిచారన్నారు. ఈ ఆఫీస్ ద్వారా దస్త్రాల పరిష్కారంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి నందుకు కార్యాలయ సిబ్బందికి జె సి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోనే ప్రథమస్థానం సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అభినందనలు తెలిపారు. ప్రజల కోసం చేస్తున్న సేవలు జిల్లా అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు నిజంగా అభినందనీయమని కలెక్టరేట్ పరిపాలనాధికారి కదలి కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. సంయుక్త కలెక్టర్ వారి మార్గదర్శకత్వంలో కోనసీమ జిల్లా మరింత అభివృద్ధి సాధించాలని మనస్ఫూర్తిగా ఆయన ఆకాంక్షించారు. సంక్షేమం కోసం జె సి తీసుకుంటున్న కృషి నిజంగా ప్రశంసనీయ మైనదని,జె సి వారి సమర్థమైన నాయకత్వం అంకిత భావంతో కోనసీమ జిల్లా మరింతగా పురోగమించాలన్నారు. భవిష్యత్తులో కూడా మీ సేవలు ప్రజలకు ఇలాగే అందాలని, మీ ఆధ్వర్యంలో జిల్లా మరింత అభివృద్ధి చెందాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. జె సి వారి సమర్థ వంతమైన పనితీరు,పార దర్శకతతో జిల్లా పాలనలో ఒక గొప్ప ముందడుగు పడిందన్నారు. ఇదే ఉత్సాహంతో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నానన్నారు. కోనసీమ జిల్లా ఇ ఆఫీస్ ద్వారా దస్త్రాల పరిష్కారంలో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించడం అద్భుతమైన విజయంగా ఏవో అభి వర్ణించారు. కలెక్టరేట్ వివిధ సెక్షన్ల సూపర్డెంట్లు ప్రసంగిస్తూ ఇ -ఆఫీస్ ద్వారా దస్త్రాల పరిష్కార విషయంలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాన్ని సాధించడం గర్వకారణమన్నారు. ఈ అద్భుత విజయం జిల్లా సిబ్బంది అందరి ప్రత్యేక శ్రద్ధ సమర్థవంతమైన పరిపాలన ,డిజిటల్ సాంకేతికతల అమలు ఫలితంగా వచ్చిందన్నారు. ఈ సాధన ద్వారా జిల్లా పౌరులకు వేగవంతమైన,పారదర్శకమైన సేవలు అందించడం జరుగు తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో ఈ విజయాన్ని స్వీకరించడం అందరికీ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కోనసీమ జిల్లా భవిష్యత్తులో కూడా అలాంటి రికార్డులు సాధించేందుకు సిబ్బంది అందరశీ కట్టుబడి ఉన్నామని వారు తెలిపారు.

# వైఎస్ఆర్సిపి పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవం.....



**పిఠాపురం:(సిటిజన్ టైమ్స్) మార్చి 12**

కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గం,పిఠాపురం మండలం, ఎఫ్.కె. పాలెం గ్రామంలో వైఎస్ఆర్సిపి పార్టీ పిఠాపురం ఇంచార్జ్ వంగా గీత విశ్వనాథ్ ఆదేశాల మేరకు 16 వ వైయస్సార్సిపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం మండల పార్టీ అధ్యక్షుడు అడపా రఘు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించామని,ఇందులో భాగంగా వైఎస్ఆర్సిపి నాయకులందరూ కలిసి కేక్ కట్ చేసి అభినందనలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సుపరిపాలన అందించింది ఏదైనా ఉంది అంటే వైసీపీ ప్రభుత్వం అని అన్నారు. అటువంటి పాలనను, అటువంటి నాయకులను,మరల ప్రభుత్వం ఏర్పాటు చేసుకుంటామని అన్నారు. ఆ తర్వాత ఇచ్చిన మాట ప్రకారం వంగా గీత విశ్వనాథ్ కు ఉప ముఖ్యమంత్రిని చేస్తారని జగన్ హామీ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి వాడపల్లి విరవాడ ఎంపీటీసీ, పి.ఎస్.నాయుడు మండల యువజన విభాగం అధ్యక్షులు,జవ్వాది కృష్ణ మాధవరావు, సింహాచలం మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్, కర్నడు సత్యనారాయణ ఎంపీటీసీ రాపర్తి, ముమ్మిడి వెంకన్న బాబు, బాబ్జి,కందా కొండరాజులు, మాదేపల్లి వెంకటరమణ మాజీ సర్పంచ్,సాన గోవిందు, యమన ఏడుకొండలు వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు తదితరులు, పాల్గొన్నారు.


## గ్రామాల్లో ఇంటింటా జనసేన సభ్యత్వ నమోదు -ఎమ్మెల్యే దేవ..



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 12**

ఇంటింటా జనసేన సభ్యత్వ నమోదులో భాగంగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం, గొంది గ్రామాలలో పర్యటించి, ప్రస్తుత సభ్యత్వ నమోదు పై నాయకులతో చర్చించారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించటానికి నాయకుల మరింత కృషి చేయాలని కోరారు. 250 జనసేన నాయకులు సభ్యత్వాల నమోదుకు నేతృత్వం వహించాలని, 250 సాధకుల కృషితో లక్ష్యాలు సాధించాలని తెలిపారు. సభ్యత్వ నమోదు తేదీ పొడిగించడం జరిగింది కావున సఖినేటిపల్లి మండలం అధిక సంఖ్యలో సభ్యత్వాల నమోదు లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన శ్రేణులు, ఎన్డీఏ నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## శ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయంలో పోటెత్తిన భక్తులు....



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 12**

అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం గ్రామంలో మెండుపాలెం లో వెలిసిన శ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు పోటెత్తినారు. ఆఖరి వారం రోజులు కావడం విశేష భక్తులు దర్శించుకున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా తీర్థం కొనసాగుచున్నది. భక్తులకు అవసరమైన నీరు, ప్రసాదం లభ్యమవుతున్నారు. అమ్మవారిని దర్శించిన భక్తులకు ప్రసాదం వితరణ చేస్తున్నామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ఏం కిరణ్, స్వామి, రాంబాబు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# దోపిడి కూటమి విధానం...

## ప్రజలకు మేలు చేయడం మరిచారు... -ఒక్క పింఛన్ మంజూరు కాలేదు...

## నిబంధనల పేరిట పింఛన్లు కోత.... -ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోయినా చంద్రబాబు...

## ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేస్తా... వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు....



**మండపేట సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**

దోపిడి చేయడమే ఈ కూటమి ప్రభుత్వం లక్ష్యం గా ఉందని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మెన్ మండపేట నియోజక వర్గ వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. మండపేట విజయలక్ష్మి నగర్ లో వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు కర్రి పాపా రాయుడు, రెడ్డి రాధాకృష్ణ, వేగుళ్ళ పట్టాభి రామయ్య చౌదరి, మండపేట పుర పాలక సంఘం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు లు, నాయకులు కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మీడియా తో మాట్లాడుతూ రాష్ట్రం లో ఒక్క పింఛన్ మంజూరు కాలేదనీ విమర్శించారు. నిబంధనల పేరిట పింఛన్లు కోత విధిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో మోసపూరితంగా ఇచ్చిన అన్ని హామీలు నిలబెట్టుకోకపోయినా చంద్రబాబు కు ప్రజలు బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు. ఈ దోపిడి ద్వంద నీతి, లంచగొండి, ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్న కూటమి ప్రభుత్వం ను ఎదుర్కొని ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ దేశం లో అత్యుత్తమ రాజకీయ పార్టీ గా వైసిపి రికార్డు సృష్టించి నట్లు చెప్పారు. సంక్షేమం, పేద ప్రజలు కోసం జగన్ చేసిన పరిపాలన ను దేశం అంతా గుర్తించిందన్నారు. మోస పూరిత వాగ్దానాలతో కూటమి అధికారం లోకి వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అధికారం లోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. జగన్ జనం మెచ్చిన నాయకుడన్నారు. ఈ పదిహేనేళ్లు పార్టీ నీ విజయవంతంగా నిర్వహించడం మాటలు కాదన్నారు. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ముక్కోవోని దీక్ష తో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ నీ నడిపిన విధానాన్ని వివరించారు. ఈ క్రమంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా కూటమి దోపిడి విధానాలే కనబడుతున్నాయని విమర్శించారు. ప్రజల కోసం పనిచేసే విధానం లేదని దుయ్యబట్టారు. గోదావరి పక్కనే తామంతా ఉన్నామని ఏ ఒక్కరైనా ఉచితంగా ఇసుక తెచ్చుకున్నామని చెప్పగలరా అంటూ నిలదీశారు. ఈ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన అనంతరం ఎక్కడ ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. గత వైసిపి హయాంలో సుమారు 66.50 లక్షల మందికి సామాజిక పింఛన్లు పంపిణీ చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత సుమారు మూడు లక్షల మందికి సామాజిక పెన్షన్లను రద్దు చేసిందని విమర్శించారు.కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి ఆరు నెలలకు ఒకసారి మతం కులం రాజకీయాలు చూడకుండా అర్హులైన పేదలందరికీ పెన్షన్లు కొత్తగా మంజూరు చేసే వారని గుర్తు చేశారు. కాగా 2025లో భర్త చనిపోతే భార్యకు పెన్షన్ ఇచ్చే జీవో మాత్రమే ఈ ప్రభుత్వం విడుదల చేసిందని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 60 ఏళ్లు నిండిన వృద్ధాప్య పెన్షన్ కోసం ఎదురు చేస్తున్న వారు సుమారు నాలుగు లక్షల మంది ఉన్నారని పేర్కొన్నారు. ఏ ఒక్కరికి కొత్త పెన్షన్ ఈ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. అటు వికలాంగులు ఇటు వృద్ధులు అటు వితంతువులు పెన్షన్ కోసం పడిగాపులు పడుతున్నారని ఆరోపించారు. 2024 నుండి భర్త చనిపోయిన వారికి పెన్షన్లు నిలిపివేసి ఇప్పుడు ఇస్తున్నారని కొత్తగా వీరు ఇచ్చిందేమీ లేదని పైగా 10 నిబంధనలు విధించి పేదవారికి పథకాల కోత విధిస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. రైతులకు రూ 20,000 ఇస్తామని మోసం చేశారని దుయ్యబట్టారు. తప్పుడు మాటలు చెప్పి మోసం చేసి అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని పేర్కొన్నారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని నియోజకవర్గంలో దోపిడీ విధానాన్ని అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో వైసిపి టౌన్ కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, వైసిపి మహిళా నాయకులు ఓగిరాల దేవి, వైసీపీ ఎస్ సి సెల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్, వైసిపి నాయకులు దూలం వెంకన్న బాబు,పోతంశెట్టి ప్రసాద్, సిరిపురపు శ్రీనివాస్, మొండి భవాని , నీలం దుర్గా, సాధనాల శివ భగవాన్, పిల్లా వీరబాబు,మందపల్లి రవి కుమార్, కొవ్వూరి త్రినాథ్ రెడ్డి, పెంకే వెంకట్రావు, ముమ్మిడివరపు బాపిరాజు, గోరు అన్నవరం,పంపన శ్రీనివాస్, కొనాల చంద్ర బోస్, కోళ్ల శ్రీనివాస్, తణుకు అశోక్, వైసిపి నాయకులు కార్యకర్తలు,అభిమానులు,కౌన్సిలర్ లు, వార్డు వైసిపి ఇన్ ఛార్జ్ లు, పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం ఆవరణ లో పార్టీ పతకాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆవిష్కరించారు.

## పొదిలిలో రంజాన్ పండగ కోసం ముస్తాబవుతున్న ఈద్గా ప్రాంతం



**పొదిలి, సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**

ముస్లింలకు అతి ముఖ్యమైన రంజాన్ పండగ కోసం స్థానిక ఈద్గా ప్రాంతం ముస్తాబవుతుం ది. రంజాన్ పండుగ రోజు పట్టణంలోని ముస్లింలు ఇక్కడి ఈద్గా ప్రాంతానికి చేరుకొని సామూహిక ప్రార్ధనలు చేయడం ఆనవాయితీ. కాగా ఈసారి పండుగ కోసం ఈద్గా ప్రాంతంలో పారిశుద్ధపు పనులు చేపట్టారు. ప్రార్థనల కోసం వచ్చే ముస్లింల కు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్ని చర్యలు చేపట్టారు. ముస్లిం నాయకులు మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని భాష, షేక్ రసూల్ మహమ్మద్, ఎస్ అల్లా బకాష్ తదితరులు పర్యవేక్షిస్తూ, ఈద్గా ప్రాంతాన్ని ప్రార్థనల కు అనుగుణంగా తీర్చి దిద్దుతున్నారు.

## ఎస్టీ కాలనీలో వీధి దీపాల సమస్యను పరిష్కరించాలి

**సి.ఎస్.పురం, సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**

మండల కేంద్రంలోని సి.ఎస్.పురం పంచాయతీ పరిధిలో గల దర్శితిమ్మక్కపల్లి గ్రామం ఎస్ టి కాలనీ లో వీధి దీపాలు వెలగక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా నాయకులు యు. వెంకటేశ్వర్లుకు గురువారం గ్రామానికి చెందిన సిపిఎం కార్యకర్తలు పుల్లయ్య, నరసింహులు, రాంబాబు, అంకయ్యలు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్టీ కాలనీలో స్తంభాలకు విద్యుత్ దీపాలు వెలగడం లేదని, దీంతో రాత్రి సమయంలో కాలనీవాసులు బయటకు వెళ్లడానికి భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యనుపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేటట్లు కృషి చేయాలని వెంకటేశ్వర్లుకు తెలిపారు.

## పొదిలిలో మానవత స్వచ్ఛంద సంస్థ చలివేంద్రం ఏర్పాటు

**పొదిలి, సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**

పొదిలిలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు జరిగింది. గురువారం నాడు పట్టణంలోని విశ్వనాథపురం సెంటర్ లో గల ముల్లా సెల్ షాప్ ఎదురుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభ సందర్భంగా సెల్ షాప్ అధినేత ముల్లా జాకీర్ ప్రజలకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. జాకీర్ అందించిన సహాయ సహకారాల పట్ల మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులతోపాటు పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

## నేడు ఖాతాలలో పీఎం కిసాన్ నిధులు- బిజెపి



**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 12**

బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు తమ్మిరెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశం లో జిల్లా బీజేపీ అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నల్లా పవన్ కుమార్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ 2019 ఫిబ్రవరి నుంచి రైతుల ఖాతాలో నేరుగా ప్రతి సంవత్సరం మూడు విడతలుగా సన్న, చిన్న కారు రైతులుకు పెట్టుబడి సాయం గా ఉపయోగపడేలా రూ.6 వేలు రైతులు ఖాతాలోకి వేయడం జరుగుతుందని, అందులో భాగంగా ఇప్పటికే 21 విడతలుగా వేస్తూ 7 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పీఎం కిసాన్ నిధి ఈ నెల 13 న శుక్రవారం అస్సాం రాష్ట్రంలో గౌహతి నుంచి 22 వ విడత 9 కోట్ల మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున వారి ఖాతాలలోకి జమవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 41 లక్షల మంది ఈ పథకానికి లబ్ధిదారులుగా ఉన్నారన్నారు. ఎవరికైతే ఈ పథకం అమలు కానీ రైతులు ఉన్నారో పీఎం కిసాన్ పోర్టల్ లో ఒక సారి చెక్ చేయించుకుని ఈ కేవీసీ చేయించుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారని అన్నారు. ఇంకమ్ ట్యాక్స్ ఉన్నవారికి ఈ పథకం వర్తించదన్నారు.ఆధార్ కార్డు, ఎకౌంట్, ఫోన్ నంబర్ లు లింక్ చేసుకుని ఈ పథకానికి లబ్ధిదారులు అవ్వాలని అన్నారు. గత బడ్జెట్లో కంటే ఈ బడ్జెట్లో వ్యవసాయానికి 7% పెరిగింది ,రూ.1.63 లక్షల కోట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం జరిగిందన్నారు. మన ప్రాంతానికి కొబ్బరి, కాజు రైతులను ప్రోత్సహించడం జరుగుతుంది. మన దేశం లోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా అనేక పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షులు మాలే శ్రీనివాస్ నగేష్, గనిశెట్టి వెంకటేశ్వరరావు, చొల్లంగి త్రినాథ్, జిల్లా కార్యదర్శి రమా వర్మ, పార్లమెంట్ మాజీ ఇంచార్జ్ ఇళ్ల సత్యనారాయణ, డీవీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## అంగర లో ప్రపంచ గ్లకోమా

# అవగాహన సదస్సు..



**మండపేట సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**

కపిలేశ్వరపురం మండలం అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వద్ద ప్రపంచ గ్లకోమా అవగాహన జరిగింది.భాగంగా అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ పి ఎన్ ఎస్ డి రత్నకుమారి ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు,ర్యాలీ నిర్వహించారు.డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ ప్రారంభం అయిన ఈ సదస్సు లు మార్చి 14వ తేదీ వరకు వారం రోజులపాటు అవగాహన సదస్సులు జరుగుతాయని గ్లకోమా వల్ల వచ్చే అంధత్వం గురించి ప్రజలలో అవగాహన కలగజేయాలని, కంటి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం డాక్టర్ పి. రత్నకుమారి వైద్య రంగం లో ఉన్నత విద్య కోసం వెళుతున్న సందర్భం లో అంగర పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు సిబ్బంది రత్నకుమారి సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్ వి వి సత్యనారాయణ, ఎం. పి. హెచ్. ఇ. ఒ.జె. మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి రామారావు, హెల్త్ విజిటర్ టీ మేరీ మణి, హెల్త్ సూపర్వైజర్ ఎం.నాని బాబు, ఆరోగ్య కార్యకర్తల ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.




## అక్రమంగా చేపల పట్టిన వారిని పట్టుకోవడం జరిగింది



**పేటీఎం ప్రతినిధి మార్చి 12 సీజన్ టైమ్స్**

పెద్ద తిప్ప సముద్రం మండలం బూర్లపల్లి పంచాయితీ నందు గల చెరువులో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు టెంట్లు వేసి చేపలు పట్టడం గమనించి గ్రామ ప్రజలు మండల అభివృద్ధి అధికారికి ఫిర్యాదు చేయడం జరిగింది అభివృద్ధి అధికారి సిబ్బందితో కలిసి చెరువులోకి వెళ్లి అక్కడ టెంటు వేసిన వారిని పరిశీలించి ఎవరు మీరు ఈ చెరువులో చేపలు పట్టడానికి ఎవరికీ పర్మిషన్ ఇవ్వలేదు అని మందలించి వారిని తక్షణమే ఖాళీ చేయాలని చెప్పడం జరిగింది.

## పవన్ అన్నయ్య నాకు, నా పిల్లలకు, ఆశ్రయం కల్పించండి...

### భర్తను,తండ్రిని,కోల్పోయి రోడ్డున పడ్డ కుటుంబం....

### తల్లికి క్యాన్సర్ ,చిన్నపిల్లలతో జీవనోపాధి లేక ఇల్లు గడవడం కష్టమైపోతుంది పవన్ అన్నయ్య.....



**పిఠాపురం/యు. కొత్తపల్లి:(సిటిజన్ టైమ్స్)మార్చి 12,,**

కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గం, యు కొత్తపల్లి మండలం, ఎండపల్లి గ్రామానికి చెందిన, బోనం రత్నం గౌరి కన్నీటి ఆవేదన. తన భర్త శ్రీను కి గత మూడు నెలల ముందు కుక్క కాటుకు గురయ్యారు. అనంతరం నెల రోజుల క్రితం మృతి చెందారు. ఆమెకు అటు తండ్రి లేడు, ఇటు భర్త లేని కుటుంబంఅయినది. ఆమె తల్లి క్యాన్సర్ వ్యాధి తో బాధ పడుచుండగా ఆమె తన ఇద్దరు ఆడ పిల్లలతో జీవనం సాగిస్తుంది.ప్రస్తుతం ఆమె కుటుంబానికి జీవనోపాధి లేని కారణంగా పవన్ కళ్యాణ్ సహాయం కోసం ఎదురు చూస్తుంది. తన కు వచ్చిన కష్టం గురించి ఆమె మాట్లాడుతూ మా కుటుంబానికి భరోసా లేదని,మా కుటుంబం ఆర్థికంగా సపోర్ట్ లేని కుటుంబం గా రోడ్డున పడిందని కన్నీటి పర్యంతం అయినది.నా తల్లి క్యాన్సర్ తో బాధపడుతూ, తండ్రిని, భర్తని,కోల్పోయి ఇద్దరు కుమార్తెలతో ఇల్లు గడవడం చాలా కష్టంగా ఉందని, నా యందు దయ ఉంచి మా ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నయ్య,మంత్రి లోకేష్,ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,అధికారులు, అందరూ నాకు జీవనోపాధి చూపించ మని వేడుకొంటున్నాను అనుచూ కన్నీటి పర్యంతం అయినది.

## ద్వారపూడి లో ఉచిత వైద్య శిబిరం...



**మండపేట సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**

ద్వారపూడి మహాత్మా గాంధీ న్యూక్లాత్ కాంప్లెక్స్ అసోసియేషన్ బిల్డింగ్ లో అనపర్తి రమాదేవి హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎముకలు డాక్టర్ రాకేష్, ఎమర్జెన్సీ డాక్టర్ కిషోర్ నాయక్, పంటి డాక్టర్ ధని సాయి రెడ్డి, డాక్టర్ నిజాముద్దీన్, రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ వస్త్ర మార్కెట్ అధ్యక్షులు చిక్కాల శ్రీనివాస్, సెక్రటరీ తిప్పాని సింహాచలం, యస్ వి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ సుంకర నాని, నాయుడు డాక్టర్, మండ వీరభద్రరావు, కంకటాల మురళీకృష్ణ, అడబాల బుల్లబ్బులు, బోడా సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

# పోరాటం నుంచి పుట్టిన శక్తి వైయస్ఆర్ సీపీ

## -ఘనంగా వైకాపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కందుకూరు, సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**

రాజన్న ఆశయ సాధనలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనకడుగు వేయకుండా ప్రజల నమ్మకంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి నిరంతరం ప్రజా సంక్షేమ అభివృద్ధి కోసం పోరాడుతుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ సందర్భంగా కందుకూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిగిన జెండా ఆవిష్కరణ సభలో వక్తలు అభిప్రాయపడ్డారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడి 16వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులందరికీ బుర్రా మధుసూదన్ యాదవ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో కందుకూరు నియోజకవర్గంలో వైఎస్ఆర్ పార్టీ నియోజకవర్గ మండల పట్టణ గ్రామ కమిటీలను నిర్మాణం చేసుకొని బలమైన పార్టీగా ఎదుగుతుందని నాయకులు తెలిపారు. ముందుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను వైకాపా కార్యాలయంలో ఎగురవేశారు. అనంతరం వైకాపా నాయకుల హర్షద్వానాల మధ్య కేక ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, మండల అధ్యక్షులు ఈదర రమేష్,జిల్లా నాయకులు



తోకల కొండయ్య, చీమల రాజా, ఉప్పుటూరి నాగేశ్వరరావు, ముప్పవరపు కిషోర్, గేరా మనోహర్, గణేష్ గంగిరెడ్డి, యడ్ల మాధవరెడ్డి, తల్లపనేని గోపి,రావులకొల్లు బ్రహ్మానందం, పాశం కొండయ్య, వల్లూరి కోటేశ్వరరావు, ఉచ్చులూరి రవీంద్ర, షేక్ రహీం, తానికొండ హరిబాబు, ఎస్కే. మస్తాన్ వలీ, పల్నాటి చెన్నయ్య, జిల్లెలమూడి కోటేశ్వరరావు, కొత్తగొర్ల వసంత లక్ష్మి, దేవరకొండ ఆదిలక్ష్మి, షేక్ ఆదామ్బి, తన్నీరు ధరణి, కుంచాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# అనిల్ కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు



**కందుకూరు, సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**

కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీ నాగలక్ష్మి మెడికల్ లీవ్‌కు వెళ్లడంతో, శాఖ పనులు అంతరాయం లేకుండా కొనసాగించేందుకు చర్యలు తీసుకున్నారు.ఈ నేపథ్యంలో కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి జె. అనిల్ కుమార్‌కు ప్రాంతీయ రవాణా అధికారి బాధ్యతలను పూర్తి అదనపు బాధ్యతలుగా అప్పగించినట్లు రవాణా కమిషనర్ వెల్లడించారు.కందుకూరు ఆర్టీఓ కార్యాలయ పరిధిలోని అన్ని పరిపాలనా, రవాణా సంబంధిత పనులను జె. అనిల్ కుమార్ పర్యవేక్షిస్తారని తెలిపారు.

# పదవ తరగతి పరీక్షా కేంద్రం పరిశీలన

**పరీక్షలు పారదర్శకంగా,క్రమశిక్షణతో**

**నిర్వహించాలి : జాయింట్ డైరెక్టర్ ఎన్.గీత**



**కొనకనమిట్ల, సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పారదర్శకంగా,క్రమశిక్షణతో నిర్వహించాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్,జాయింట్ డైరెక్టర్ ఎన్.గీత సూచించారు.గురువారం మండలంలోని పెదారికట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆమె సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణకు కేటాయించిన గదులు,విద్యార్థుల కూర్చునే ఏర్పాట్లు,తాగునీరు,విద్యుత్,పరిశుభ్రత వంటి సౌకర్యాలను ఆమె పరిశీలించారు.పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శివకుమార్‌కు సూచించారు.అలాగే పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు.పరీక్షా విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని ఆమె ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు షేక్ డాంగే షరీఫ్,బరిగె నరసింహారావు సిబ్బంది పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బందికి రిఫ్రెషర్ ట్రైనింగ్...



**పుల్లల చెరువు, సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పుల్లల చెరువు మండల పరిషత్ కార్యాలయంలో మండల చెంచు ప్రాంత సచివాలయ సిబ్బందికి నాలెడ్జ్ ట్రాన్స్ఫర్ రిఫ్రెషర్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ట్రైకార్ మేనేజింగ్ డైరెక్టర్ సి.ఎ. మణికుమార్ ఆదేశాల మేరకు, పి.యం.యు సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ కిరణ్ కుమార్ సూచనలతో ఎం.పి.డి.ఓ మరియదాసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.పుల్లల చెరువు--1, 2, శతకోడు, ముటుకుల, ఐ.టి.వరం--1, తెల్లగట్ల, ఎంర్రపల్లి, కొమరోలు, నరజముల తండా గ్రామాలకు చెందిన 9 సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొన్నారు. చెంచు గిరిజనులకు అందిస్తున్న సేవలపై ముఖ్యంగా ఆధార్, జనన--మరణ ధ్రువపత్రాలు, రైస్ కార్డు, అన్నదాత సుఖీభవ పథకం, భూముల మ్యూటేషన్ వంటి అంశాలపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు.రిసోర్స్ పర్సన్‌గా పాడేరు ఐటిడిఏకు చెందిన ఆర్. రామగోపాల్ పాల్గొని ఆధార్, రైస్ కార్డు అప్డేట్లు, పథకాల రిజెక్షన్ కారణాలు, వారసత్వ భూముల బదిలీ విధానం, లేట్ బర్త్--డెత్ సర్టిఫికెట్ల ప్రక్రియ, బ్యాంక్ ఎన్పీసీఐ సమస్యల పరిష్కారంపై వివరించారు.ట్రైనింగ్ అనంతరం సిబ్బందికి ట్రైనింగ్ మెటీరియల్ అందజేశారు.అనంతరం ఎం.పి.డి.ఓ మరియదాసు మాట్లాడుతూ చెంచుల సంక్షేమ కార్యక్రమాల్లో సమన్వయంతో పనిచేసి వారికి వేగవంతంగా సేవలు అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో సచివాలయం ఎంపీడీవో చక్రవర్తి, పి.యం.యు ఏపీఐఓ మధుసూదనరావు, షేక్ కమురుద్దీన్, షేక్ మహబూబ్ బాషా, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ పర్సన్ కలివల సమ్యూయల్,అసిస్ట్ స్వచ్ఛంద సేవ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలు

**బుధవారం 14 మంది గురువారం 14 మంది పరీక్షలకు గైర్హాజరు**

**ఒకేషనల్ సబ్జెక్టులన్నీ పరిసమాప్తి**

**గిద్దలూరు , సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**

ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో భాగంగా 14 వరోజు బుధవారంనాడు రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించబడింది. వాణిజ్య శాస్త్రం -2 తో పాటు ఒకేషనల్ వారికి బ్రిడ్జి కోర్సు ఫిజికల్ సైన్సెస్ -2 ఈ రోజు నిర్వహించబడ్డాయి. దీంతో ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన అన్ని సబ్జెక్టుల పరీక్షలు పూర్తయినట్లే. పరీక్ష కేంద్రాల్లో కస్టోడియన్ వి. పూర్ణ చంద్రుడు తనిఖీ నిర్వహించారు. పట్టణములోని మూడు పరీక్ష కేంద్రాలకు 163 మంది హాజరవ్వాల్సి ఉండగా 149 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల వారీగా వివరాల వారిగా శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో 113 మందికి 105 మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరయ్యారు. శ్రీ జీవనజ్యోతి జూనియర్ కళాశాలలో 31 మందికి 26 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు.సాహితి జూనియర్ కళాశాలలో 19 మందికి గాను18 మంది హాజరై, ఒక్కరు గైర్హాజరయ్యారు. గురువారం నాడు ఇంటర్మీడియట్ పరీక్షల లో 15 రోజుకుడా 14 మంది గైర్హాజరు అయ్యారు. ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో భాగంగా 15 వరోజు గురువారంనాడు మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించబడింది. వాణిజ్య శాస్త్రం -1(న్యూ ), వాణిజ్య శాస్త్రం -



1(ఓల్డ్) లు నిర్వహించబడ్డాయి. పరీక్ష కేంద్రాల్లో కస్టోడియన్ వి. పూర్ణ చంద్రుడు తనిఖీ నిర్వహించారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు ఎం. మురళీకృష్ణ,ఎ.అల్లూరయ్య,ఆర్. శిరీష కుమారి హాజరు వివరాలను తెలిపారు. పట్టణములోని మూడు పరీక్ష కేంద్రాలకు 81మంది హాజరవ్వాల్సి ఉండగా 67 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల వారీగా వివరాలిలా ఉన్నాయి. శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో 20 మందికి 16 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు. జీవనజ్యోతి జూనియర్ కళాశాలలో 25 మందికి 21 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు.సాహితి జూనియర్ కళాశాలలో 36 మందికి గాను 30 మంది హాజరై, ఆరుగురు గైర్హాజరయ్యారు.

# మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు ఆర్ డి రామకృష్ణకు పరామర్శ



బిజెపి నాయకులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ ప్రముఖ సామాజిక వర్గ ముఖ్య నాయకులు మున్సిపల్ ఉపాధ్యక్షులు ఆర్ డి రామకృష్ణ ఇటీవల గుండెకు సెర్జరీ చేసుకున్న విషయం తెలుసుకొని పట్టణ భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు అప్పి శెట్టి ఉదయ్ శంకర్ ఆయన స్వగృహం లో కలసి ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని త్వరగా కోలుకొని ప్రజా జీవితము లోకి రావాలని ఆకాంక్ష తెలియ చేశారు. ఈ కార్యక్రమం లో భారతీయ జనతా పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చింది

***గిద్దలూరు లో ఘనంగా వైఎస్ఆర్సిపి ఆవిర్భావ దినోత్సవం..***



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**

వైఎస్ఆర్సిపి ఆవిర్భావానికి 16 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా గిద్దలూరు వైఎస్ఆర్సిపి ఇన్‌చార్జ్ కుందూరు నాగార్జున రెడ్డి గురువారం గిద్దలూరులో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. పార్టీ 17వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పార్టీ కార్యకర్తలతో సమావేశమై ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ

***కుందూరు నాగార్జున రెడ్డి విమర్శ***

సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి లక్ష్యంగా వైఎస్ఆర్సిపి పార్టీ ఏర్పడిందని తెలిపారు. పార్టీ స్థాపన నుండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. గతంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు లబ్ధి పొందారని గుర్తుచేశారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం వైఎస్ఆర్సిపి పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణ చేసి, నాయకులతో కలిసి కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొమరోలు పిహెచ్సిలో 13 మంది బాలికలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్.

**సర్వైకల్ క్యాన్సర్ సుఖకుండా ముందు జాగ్రత్తగా వ్యాక్సినేషన్.**





**కొమరోలు, సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**

భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వారం ద్వారా క్యాన్సర్ సోకుండా ఉండేందుకు వీలుగా ముందు జాగ్రత్త చర్యలుగా 14 సంవత్సరాలు నిండిన బాలికలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్ చేసే కార్యక్రమం చేపట్టామని కొమరోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని వి శాంతి తెలిపారు. కొమరోలు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమానికి వైద్యాధికారిని వీ.శాంతి అధ్యక్షత వహించగా, ఎంపీపీ అమూల్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా పలు పాఠశాలల నుంచి తరలివచ్చిన విద్యార్థుల వివరాలను ముందుగా ఆన్లైన్ లో నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం 13 మంది బాలికలకు వైద్యాధికారిణి శాంతి పర్యవేక్షణలో హెచ్పివి వ్యాక్సినేషన్ చేశారు .14 సంవత్సరాలు నిండిన బాలికలందరూ తప్పనిసరిగా హెచ్పివి వ్యాక్సినేషన్ చేయించుకోవాలని, అందుకోసం కొమరోలు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి సోమ, మంగళ, గురు, శుక్రవారం లో వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు .ఆ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ లు ఆవులయ్య ,సౌజన్య, ఏఎన్ఎంలు ,ఆశా కార్యకర్తలు, కొమరోలు పిహెచ్సి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నివారణ వ్యాక్సినేషన్ ప్రారంభించిన డాక్టర్ ఇమాంస

**పొదిలి, సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**

మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పొదిలి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సార్ ప్రారంభించారు. గురువారం నాడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన చైర్మన్ డాక్టర్ ఇమాంస మాట్లాడుతూ 14 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల లోపు వయస్సు గల ఆడపిల్లలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ వ్యాక్సినేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని విధాలా సురక్షితమైన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అర్హులైన ఆడపిల్లలందరూ సద్వినియోగపరుచుకోవాలని ఇమాంస కోరారు. ఉప్పలపాడు, పొదిలి ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు ఎం సుగుణ కుమార్, పి శరత్ చంద్ర లు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అర్హులైన బాలికలకు వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. వైద్యుల పర్యవేక్షణలో జరిగే ఈ వ్యాక్సిన్ కార్యక్రమం అన్ని విధాల సురక్షితమైనదని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని భాష, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**అక్కలరెడ్డిపల్లి గ్రామంలో**

# అగ్ని ప్రమాదం

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ మార్చ్ 12**


గిద్దలూరు మండలం అక్కలరెడ్డిపల్లి గ్రామంలో గురువారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఇంటి వద్ద ఉన్న పూరీల్లు పూర్తిగా దగ్ధమైంది సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకొని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే పూరీల్లు మంటలకు ఆహుతైంది. ఈ ఘటనలో సుమారు రు 50,000 నష్టం వాటిల్లిందని ఇంటి యజమాని పుల్లమ్మ వాపోయింది.

# 'ఉస్తాద్' సర్ప్రైజ్ టీజ్.. పెర్ఫెక్ట్ కమర్షియల్ బొమ్మలా ఉందే!

అనసూయ భరద్వాజ్ వైబింగ్ హైపై దృష్టి సారించింది



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి తాజాగా విడుదలైన సర్ప్రైజ్ గ్లింప్స్.. అందరినీ ఆకట్టుకుంటోంది. స్టార్ డైరెక్టర్ హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న ఆ కమర్షియల్ ఎంటర్టైనర్ ఉగాది కానుకగా మార్చి 19వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో మేకర్స్ ట్రైలర్ కు ముందు చిన్న వీడియోను విడుదల చేసి సినిమాపై మరింత ఆసక్తి పెంచారు.




ట్రైలర్ టీజ్ పేరుతో విడుదలైన ఆ గ్లింప్స్ లో పవన్ కళ్యాణ్ మాస్ స్టైల్‌లో కనిపిస్తూ అభిమానులను అలరిస్తున్నారు. బ్యాక్ గ్రౌండ్‌లో భగవద్గీత శ్లోకాలు వినిపిస్తుండగా పవన్ చెప్పిన డైలాగ్ అభిమానులకు ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. "ఇందాక విన్నది భగవద్గీత.. ఇది భగత్ గీత.. దమ్మున్నోడు దాటొచ్చు" అంటూ ఆయన చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాలో ఫుల్ గా ఫ్యాన్స్ వైరల్ చేస్తున్నారు.సుమారు 43 సెకన్ల నిడివి ఉన్న ఉస్తాద్ భగత్ సింగ్ టీజ్‌లో పవన్ కళ్యాణ్ ను పలు లుక్స్ లో చూపించారు మేకర్స్. ముఖ్యంగా పోలీస్ ఆఫీసర్ గెటప్ లో ఆయన కనిపించడం ఆకట్టుకుంటోంది. లుంగీతో మాస్ స్టైల్, కౌబాయ్ క్యాప్ తో మరో స్టైలిష్ లుక్ లో కనిపిస్తూ ఆయన ఆకర్షించారు. యాక్షన్ సన్నివేశాలు సినిమాలో ఎక్కువ ఉండనున్నాయని మేకర్స్ హింట్ ఇచ్చారు.సినిమా పెర్ఫెక్ట్ కమర్షియల్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్నట్లు టీజ్ చూస్తే క్లియర్ గా తెలుస్తోంది. హరీష్ శంకర్ తన స్టైల్ కు తగ్గట్లుగా పంచ్ డైలాగులు, మాస్ ఎలిమెంట్స్ తో సినిమాను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది.

గతంలో పవన్ కళ్యాణ్ తో చేసిన గబ్బర్ సింగ్ విజయాన్ని గుర్తు చేసేలా.. మరోసారి అభిమానులను అలరించే విధంగా చిత్రం ఉండనుందని అర్థమవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ స్క్రీన్ ప్రెజెన్స్, కమాండింగ్ బాడీ లాంగ్వేజ్, మాస్ డైలాగులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మొత్తానికి చిన్న గ్లింప్స్ తో మేకర్స్ సినిమాపై అంచనాలు పెంచేశారని చెప్పాలి. ఇది కేవలం చిన్న గ్లింప్స్ మాత్రమేనని, త్వరలో విడుదలయ్యే ట్రైలర్ తో మరిన్ని హోప్స్ పెరుగుతాయని మేకర్స్ చెబుతున్నారు.ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. విడుదల తేదీ ముందుకు రావడంతో చిత్రబృందం పనులను వేగవంతం చేసింది. తాజాగా పవన్ కళ్యాణ్ డబ్బింగ్ ప్రారంభించారు. ట్రైలర్ టీజ్ కోసం ప్రత్యేకంగా ఆయనతో డబ్బింగ్ చెప్పించినట్లు తెలుస్తోంది. దేవిశ్రీప్రసాద్ పాటలు అందించగా, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కోసం తమన్ రంగంలోకి దిగారు..

తాజాగా విడుదలైన టీజ్ లో తమన్ ఇచ్చిన బీజీఎం వినిపించింది. టైటిల్ కార్డ్ లో తమన్ స్కోర్ అని ప్రత్యేకంగా ప్రస్తావించారు. చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. పార్థిబన్, కేఎస్ రవికుమార్, రావు రమేష్, రాంకీ, కేజీఎఫ్ అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు.

సౌత్ స్టార్ కేథరిన్ త్రెసా స్టైలిష్ ఫోటోషూట్‌తో తలదాచు కుంది



# బ్యాటింగ్ లెజెండ్ ద్రవిడ్‌కు లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ పురస్కారం!

రాహుల్ ద్రవిడ్‌కు సీకే నాయుడు జీవిత సాఫల్య పురస్కారం

క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపిక

టీ20 ప్రపంచకప్ విజేతలతో పాటు పలు జట్లకు సత్కారం

దేశవాళీ క్రికెట్‌లో ఉత్తమ సంఘంగా ముంబై క్రికెట్ అసోసియేషన్

మార్చి 15న ఢిల్లీలో బీసీసీఐ 'నమన్' అవార్డుల ప్రదానం




భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వార్షిక అవార్డుల ప్రదానోత్సవానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 15న దేశ రాజధాని ఢిల్లీలో 'నమన్' పేరుతో జరగనున్న ఈ కార్యక్రమంలో భారత బ్యాటింగ్ దిగ్గజం, మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు ప్రతిష్ఠాత్మక కల్నల్ సీకే నాయుడు జీవిత సాఫల్య పురస్కారం లభించనుంది. అదేవిధంగా, భారత టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను 'ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్' (పాలి ఉమ్రిగర్ అవార్డు) విభాగంలో ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. భారత క్రికెట్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా ద్రవిడ్‌ను లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ పురస్కారానికి ఎంపిక చేశారు. ఆయన మార్గనిర్దేశంలోనే భారత్ 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన సంగతి తెలిసిందే. మరోవైపు, 2025లో టెస్టుల్లో 983 పరుగులు, వన్డేల్లో 490 పరుగులతో అద్భుత ప్రదర్శన కనబరిచిన శుభ్‌మన్ గిల్‌కు 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' గౌరవం దక్కనుంది. టీ20 ప్రపంచకప్ జట్టులో గిల్ సభ్యుడు కానప్పటికీ, టెస్టులు, వన్డేల్లో నిలకడైన ప్రదర్శనతో ఈ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ వేడుకలో... ఇటీవల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత పురుషుల జట్టు, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2025 మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్లతో పాటు అండర్-19 ప్రపంచకప్ విజేతలను కూడా బీసీసీఐ సత్కరించనుంది. అయితే, ఇదే రోజున దేశవాళీ టోర్నీల ఫైనల్స్ ఉండటంతో కొంతమంది మహిళా క్రికెటర్లు ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోవచ్చని సమాచారం. దేశవాళీ క్రికెట్‌లో ఉత్తమ పనితీరు కనబరిచిన అసోసియేషన్ గా ముంబై క్రికెట్ అసోసియేషన్ వరుసగా మూడోసారి అవార్డు అందుకోనుంది. వీరితో పాటు రంజీ ట్రోఫీలో అత్యధిక పరుగులు, వికెట్లు తీసిన యశ్ రాథోడ్, యశ్ దూబేలకు మాధవరావు సింధియా అవార్డులు, ఉత్తమ అంపైర్‌గా ఉల్హాస్ గాంధే తదితరులకు కూడా పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

# ఆర్సీబీకి బిగ్ షాక్.. ఐపీఎల్ 2026కి ముందు స్టార్ బౌలర్ దూరం?



మార్చి 28 నుంచి ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)2026 19వ సీజన్ ప్రారంభం కానుంది. ఈ మెగా టోర్నమెంట్ కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్నారు. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బరిలోకి దిగబోతుంది. ఆ టోర్నీ ప్రారంభానికి ముందే ఆర్సీబీకి సంబంధించిన ఒక ఆందోళన కలిగించే న్యూస్ బయటకు వచ్చింది. ఆ జట్టు స్టార్ పేసర్ జాష్ హేజిల్‌వుడ్ ఇంకా పూర్తిగా గాయం నుంచి కోలుకోలేదని తెలుస్తుంది. ఎన్నో ఏళ్లుగా ఐపీఎల్ ట్రోఫీని దక్కించుకోవాలనే కోరికతో బరిలోకి దిగిన ఆర్సీబీ 2025లో చివరికి దాన్ని కైవసం చేసుకుంది. ఆ విజయంలో ఆస్ట్రేలియా పేసర్ జోష్ హేజిల్‌వుడ్ కీలక పాత్ర పోషించాడు. గత సీజన్‌లో ఆర్సీబీ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా జోష్ నిలిచాడు. ముఖ్యంగా ఫైనల్ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు బ్యాటర్లను ఇబ్బంది పెట్టి మ్యాచ్ ని తమ వైపుకు మార్చడంలో కీలకంగా వ్యవహరించాడు.గాయపడిన హేజిల్‌వుడ్ ప్రతిష్టాత్మకమైన ది యాషెస్ సిరీస్‌తో పాటు భారత్‌లో జరిగిన టీ20 సిరీస్ నుంచి తప్పుకున్నాడు. తాజా సమాచారం ప్రకారం అతడు ఇంకా పూర్తిగా కోలుకోలేదని సమాచారం. ప్రస్తుతం ఫిజియో పర్యవేక్షణలో ఫిట్‌నెస్ సాధించే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో జోష్ ఐపీఎల్ 2026లో ఆడతాడా లేదా అన్నది ప్రస్తుతం సందేహంగా మారింది. అయితే మార్చి 28వ తేదీలోపు అతడు పూర్తిగా ఫిట్ అయ్యే ఛాన్సులు 50-- -50గా ఉన్నాయని టాక్. ఒకవేళ జోష్ హేజిల్‌వుడ్ ఐపీఎల్ కి దూరమైతే.. ఆర్సీబీకి బిగ్ షాకే అని చెప్పాలి.

# జస్‌ప్రీత్ బుమ్రా సంచలన నిర్ణయం.. టీ20లకి గుడ్ బై?



టీ20 ప్రపంచకప్ లో అద్భుతమైన బౌలింగ్ తో ప్రత్యర్థి బ్యాటర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన బౌలర్ జస్ప్రీత్ బుమ్రా.. తన యార్కర్లు, పదునైనా బంతులతో ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తున్న బుమ్రా.. తాజాగా సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. బుమ్రా నిర్ణయంపై ఫ్యాన్స్ షాక్ అయినట్లు తెలుస్తుంది. టీమిండియా భవిష్యత్తు ప్రణాళికలను చూస్తే ఇది ఒక మాస్టర్ ప్లాన్‌లా కనిపిస్తుంది. వచ్చే 18 నెలల పాటు బుమ్రా టీ20 ఫార్మాట్‌కు దూరంగా ఉండే ఛాన్స్ ఉందని బీసీసీఐ వర్గాలను నుంచి సమాచారం అందుతుంది. ఇది రిటైర్మెంట్ కాదు, కేవలం వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా తీసుకున్న ఒక నిర్ణయం మాత్రమేనని పేర్కొంటున్నారు.

2027లో జరగనున్న వన్డే వరల్డ్ కప్‌పైనే ఇప్పుడు టీమిండియా పూర్తిగా దృష్టి పెట్టింది. ఈ మెగా టోర్నమెంట్‌లో జస్ ప్రీత్ బుమ్రా సేవలు అత్యంత కీలకం కావడంతో.. అతడిని శారీరకంగా, మానసికంగా రెడీ చేసేందుకే బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. దాదాపు ఏడాదిన్నర తర్వాత జరగబోయే ఈ ప్రపంచ కప్‌ను దక్షిణాఫ్రికా, జింబాబ్వే , నమీబియా దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. మొత్తం 14 జట్లు ఈ టోర్నీలో పోటీ పడనున్నాయి. 54 మ్యాచ్‌లు జరగనుండగా, అందులో 44 మ్యాచ్‌లకు సౌతాఫ్రికా ఆతిథ్యం ఇవ్వనుండగా.. మిగిలిన 10 మ్యాచ్‌లను జింబాబ్వే, నమీబియా వేదికలుగా కొనసాగుతాయి. ఇది 2003 ప్రపంచ కప్ తరహాలో జరిగే ఛాన్స్ ఉంది. ఇందులో రెండు గ్రూపులుగా టీమ్స్ విడిపోయి, సూపర్ సిక్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్లో పోటీ పడుతాయి. జస్‌ప్రీత్ బుమ్రా వయస్సు, ఫిట్‌నెస్ ని పరిగణనలోకి తీసుకుని.. అన్ని ఫార్మాట్లలో అతడు ఆడి అలసిపోవడం జట్టుకు పెద్ద నష్టం కలుగజేస్తుంది. కాబట్టి, బుమ్రాను వన్డేలు, టెస్టులకే పరిమితం చేసి, వన్డే ప్రపంచ కప్ 2027 కోసం పదును పెట్టాలని టీమిండియా మేనేజ్‌మెంట్ చూస్తుంది. బుమ్రా కూడా ఈ నిర్ణయానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఏదేమైనా, బుమ్రా టీ20 ఫార్మాట్లో కనిపించకపోవడం క్రికెట్ అభిమానులకు లోటుగానే అనిపిస్తుంది. కానీ, 2027లో వరల్డ్ కప్ ట్రోనీని దక్కించుకోవాలంటే మన బుమ్రా అప్పటి వరకు అద్భుతమైన ఫామ్, ఫిట్‌గా ఉండటం చాలా ముఖ్యం.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776